Follow: @ANNTELUGU

ANN తెలుగు

17-03-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 105 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## పాక్‌తో శాంతికి యత్నించినప్పుడల్లా ద్రోహం విద్వేషాన్నే చూశాం

### ఇప్పటికైనా శాంతి మార్గాన్ని పాక్ ఎంచుకోవాలి

ట్రంప్‌కు 'అమెరికా ఫస్ట్'.. నాకు 'ఇండియా ఫస్ట్'

ప్రధాని నరేంద్ర మోదీ

**మహా :** పాకిస్తాన్‌తో శాంతి చర్చల కోసం భారత్ గౌరవపూర్వకంగా ప్రయత్నాలు చేసిన ప్రతిసారీ ద్రోహం, విద్వేషమే ప్రతిఫలంగా లభించాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం దిశగా ఇరుదేశాలు కొత్త అధ్యాయాన్ని మొదలు పెట్టాలనే గొప్ప సంకల్పంతో 2014లో ప్రధానిగా ప్రమాణం చేసే వేళ నాటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ఆహ్వానించానని ఆయన గుర్తు చేసుకున్నారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## ఓటమి భయంతోనే తమిళనాడులో కొత్త డ్రామా

- ప్రజా విశ్వాసం కోల్పోయిన స్టాలిన్ ప్రభుత్వం
- ప్రాంతీయ విద్వేషాలతో పబ్బం గడుపుకోవాలను కోవడం దారుణం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



03

## రుణ మాఫీ జరగలే

- నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్



02

## ఏఆర్ రహమాన్ అస్వస్థత, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

- స్వల్ప అస్వస్థతకు గురయ్యారన్న అపోలో వైద్యులు
- ఏఆర్ రహమాన్ ఆరోగ్యంపై తమిళనాడు సీఎం పోస్ట్



02



## నటుడు విశ్వక్ సేన్ ఇంట్లో చోరీ

- జూబ్లీహిల్స్ ఫిల్మ్ నగర్ లో సంచలనం
- రూ.2.20 లక్షల బంగారు ఆభరణాలు మాయం
- బైక్ మీద వచ్చి.. 20 నిమిషాల్లోనే చోరీ చేసి జంప్

వివరాలు 2లో



## సీఎంను కలిసిన గిరిజన యూనివర్శిటీ వీసీ వైఎల్ శ్రీనివాస్

**హైదరాబాద్, మహా:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ములుగు సమ్మక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వై.ఎల్. శ్రీనివాస్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. వైఎల్ ను అభినందించారు.



## ఇరాన్ బీచ్‌లో బ్లడ్ రెయిన్

- రక్త ప్రవాహంలా సముద్రంలోకి చేరుతున్న వర్షపు నీరు
- ఎరుపు వర్ణంలోకి మారిన తీర ప్రాంతం

వివరాలు 2లో






## కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయ్యింది

గత పదేళ్లలో రూ.1.81 లక్షల కోట్లను ప్రాజెక్టుల పేరు మీద కేసీఆర్ ఖర్చు పెట్టారని, ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిపోయి కూలేశ్వరం అయ్యిందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులే ఈనాటికి నీళ్లు అందిస్తున్నాయని అన్నారు. శ్రీరామ్‌సాగర్, నాగార్జునసాగర్, కోయిల్‌సాగర్, ఇందిరాసాగర్ నిర్మించింది ఎవరని ప్రశ్నించారు

# కేసీఆర్ ఎవరికి జాతిపిత?

### దోచుకున్నోళ్ళయితరా ? త్యాగం చేసినోళ్ళయితరా?

- అధికారిక కార్యక్రమాల్లో తిడతడని హరీష్ రావు అంటున్నడు?
- ఇలా మాట్లాడితే.. తిట్టకుండా ఏం చేయాలె?
- తెలంగాణ జాతిపిత అంటే కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొ.జయశంకర్
- పిల్ల కాకులతో ఎందుకు.. అసలైన వాళ్లనే రమ్మనండి..ఏ ప్రాజెక్టు గురించైనా చర్చకు రెడీ
- ఇది ఇంటర్వెల్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది
- స్టేషన్ ఘన్‌పూర్ సభలో కేసీఆర్, హరీష్ లపై రేవంత్ రెడ్డి నిప్పులు
- స్టేషన్ ఘన్ పూర్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

**స్టేషన్ ఘన్ పూర్, మహా:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితని మాజీ మంత్రి హరీష్‌రావు అనడంపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. జాతిపితకు కేసీఆర్‌కు ఏమైనా పోలిక ఉందా? అంటూ ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అసలైన జాతిపితకు మందు వాసన తెలుసా? హరీశ్ రావు అంటూ చురకలు అంటించారు. నిజమైన జాతిపిత దళిత వాడల్లో జీవితం గడిపారని, మరి హరీశ్ రావు చెప్పే జాతిపిత ఫామ్ హౌస్‌లో పడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ జాతిపిత అంటే కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొ.జయశంకర్ అని చెప్పుకొచ్చారు. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం శివునిపల్లెలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపనలు చేశారు.

మిగతా 2లో

# ఎంపీ డీకే అరుణకు ముప్పు

### అర్ధరాత్రి జూబ్లిహిల్స్ ఇంట్లోకి ఆగంతకుడు

- గంటన్నరపాటు ఇంట్లోనే తచ్చాడి రెక్కీ.. సీఎం ఇంటిసమీపంలోనే సంఘటన
- వస్తువులు తీసుకెళ్ళకుండా.. ఏం చేశాడు? .. భద్రత పెంచాలని డీకే అరుణ విజ్ఞప్తి
- ముఖ్య మంత్రి సీరియస్ గా దృష్టి సారించాలని డిమాండ్
- దుండగుల చొరబాటుపై అనుమానాలున్నాయి డీకే అరుణ
- కుటుంబసభ్యులు భయాందోళనకు గురవుతున్నారు డీకే అరుణ

02





## రేవంత్ కేసీఆర్‌లా తయారయ్యారు

### బట్టలూడదీసే ఫాంటసీ ఏంటి?

కల్వకుంట్ల కుటుంబంతో మ్యాచ్ ఫిక్సింగ్

బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సెటైర్లు వేశారు. ఆదివారం బీజేఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీల ఎగవేత, సమాధానాల దాటవేతల ప్రభుత్వమని మండిపడ్డారు. అదే సమయంలో రేవంత్ ఏకపాత్రాభినయం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో

# కేసీఆర్ ఎవరికి జాతిపిత?




(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కేసీఆర్‌కు పట్టదని, తీసుకుంటున్న జీతానికైనా ఆయన న్యాయం చేయడం లేదంటూ మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం రూ. లక్ష కోట్లు ఎలా సంపాదించిందో చెప్పాలంటూ రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ కోసం సర్వం ధార పోసిన వాళ్లు తెలంగాణ జాతిపిత అవుతారని, ప్రజల సొమ్ము దోచుకుని ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న వాళ్లు జాతిపిత ఎలా అవుతారని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్ము దోచుకుని పేపర్, టీవీ ఛానెళ్లు పెట్టుకున్న వ్యక్తి జాతిపిత ఎలా అవుతారని ప్రశ్నించారు.

**సవ్యంగా పరీక్షలు నిర్వహించి ఉద్యోగాలు ఇచ్చాం**

గ్రూప్1, 2, 3 పరీక్షలను సవ్యంగా నిర్వహించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించే కృషి చేస్తున్నామని అన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను కేసీఆర్ దివాళా తీయించారని విమర్శించారు. ఎన్ని సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని, తెలంగాణ రాష్ట్రానికి కడియం అవసరం ఉందని చెప్పి పార్టీలోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం త్వరలోనే పూర్తి కానుందని తెలిపారు.

**విధులకు వెళ్లకుంటే ఎవరికైనా జీతం వస్తుందా?**

ఎమ్మెల్యేగా జీతభత్యాలు తీసకుంటున్న వ్యక్తి తన బాధ్యతలు నెరవేర్చటం లేదని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. 15 నెలలుగా రూ.16 లక్షల జీతభత్యాలు తీసుకున్న వ్యక్తి అసెంబ్లీకి మాత్రం రావట్లేదని, ప్రజల సొమ్మును జీతభత్యాలుగా తీసుకునే వ్యక్తి ప్రజల కోసం అసెంబ్లీలో సూచనలు ఎందుకు చేయటం లేదని, ఉద్యోగం చేయకుంటే, విధులకు వెళ్లకుంటే ఎవరికైనా జీతం వస్తుందా, తన అనుభవాన్ని ప్రజల కోసం ఎందుకు ఉపయోగించటం లేదని అని ప్రశ్నించారు.

**కేసీఆర్ పాపాలచిట్టాను విప్పుతా**

కేసీఆర్ చేసిన తప్పులకు ఒక్క ఏడాదిలోనే ఈ ప్రభుత్వం రూ.1.53 లక్షల కోట్లు వడ్డీలుగా కట్టిందని, ఏడాదిలోనే రూ.84 వేల కోట్లు వడ్డీలకు, రూ.64 వేల కోట్లు అసలు కింద చెల్లించామని అన్నారు. పదేళ్లు పాలించిన వ్యక్తి ఏడాదికే మమ్మల్ని దిగిపోమ్మని అంటున్నారని, ఐదేళ్ల కాలానికి ప్రజలు తీర్పు ఇచ్చి మమ్మల్ని పదవిలో కూర్చోబెట్టారని అన్నారు. తెలంగాణను పాపాలపుట్ట మాదిరి అప్పులపాలు చేశారు. దొంగలు, దోపిడీదారులను బట్టలిప్పి బజారులో నిలబెడతా. కేసీఆర్ పాపాల చిట్టా మొత్తం విప్పుతా అంటూ రేవంత్ రెడ్డి విరుచుకు పడ్డారు.

## పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

**బహిరంగ సభకు ముందు స్టేషన్‌ఘన్‌పూర్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ నిర్మాణానికి, రూ.46కోట్లతో 100 పడకల అస్పత్రి నిర్మాణానికి, రూ.26కోట్లతో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్‌కు, రూ.38కోట్లతో పంచాయతీ రాజ్ బీటీ రోడ్ల నిర్మాణానికి, స్టేషన్‌ఘన్‌పూర్‌లో రూ.5 కోట్లతో డిగ్రీ కళాశాల నిర్మాణానికి, మారుమూల తండాలకు రోడ్లు, బంజారా భవన నిర్మాణానికి శంకుస్థాపన రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. మహిళా శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులు, బ్యాంక్ లింకేజ్ లోన్‌లు సీఎం ప్రారంభించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో 5సబ్ స్టేషన్లు, డివిజన్ ఆఫీసు నిర్మాణానికి, 5వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.**



# ఎంపీ డీకే అరుణకు ముప్పు




**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని బీజేపీ సీనియర్ నేత, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి శనివారం అర్ధరాత్రి దాటాక ఒక అగంతకుడు చొరపడ్డాడు. ఏకంగా గంటన్నర పాటు ఇంట్లోనే కలియతిరిగాడు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తన నివాసంలో ఆగంతకుడు చొరబడిన ఘటనపై మహబూబ్ నగర్ లో ఎంపీ డీకే అరుణ అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ లోని ఎంపీ డీకే అరుణ నివాసంలోకి శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని అగంతకుడు ప్రవేశించాడు. ముసుగు, గ్లౌజులు ధరించిన దుండగుడు అందరి కళ్లు గప్పి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లోకి ప్రవేశించగానే ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు పూర్తిగా ఆఫ్ చేశారు. కిచెన్, హాల్, సీసీ కెమెరాలు ఆఫ్ చేసి సుమారు గంటన్నర పాటు ఇంట్లోనే అటూ ఇటూ తిరిగాడు. అలికిడికి కుటుంబసభ్యులకు మెలకువ వచ్చి లేశారు. ఇంట్లో ఒక అగంతకుడు ఉండడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై.. విషయాన్ని వెంటనే ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆమె అప్రమత్తమై జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంటి పరిసరాలను పరిశీలించారు. ఇంటితో పాటు స్థానికంగా ఉన్న సీసీకెమెరాలను జల్లెడ పడుతున్నారు.ఇందులో కుట్ర కోణం దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. తన ఇంటికి భద్రత పెంచాలని డీకే అరుణ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కాగా, దుండగుడు ఇంట్లో చొరబడ్డ సమయంలో డీకే అరుణ లేకపోవడం గమనార్హం. తాను సీఎం ఉండే ఏరియాలోనే ఉంటానని, అయినా దుండగులు చొరబడుతున్నారన్నారు. గతరాత్రి ఓ దుండగులు నా ఇంట్లోకి వెనక కిచెన్ లోకి ప్రవేశించి గంటన్నరపాటు కలియదిరిగి వెళ్లిపోయాడని, ఇది ముమ్మాటికీ అనుమానాలకు తావిస్తోందన్నారు. అసలీ దుండగులు నా ఇంట్లోకి ఎందుకు చొరబడ్డాడో అన్నవిషయం ఆలోచిస్తేనే భయం వేస్తోందన్నారు.

**అసలేం జరిగిందంటే...?**

ఎంపీ డికె అరుణ తాజా సంఘటనపై అనుమానాలు వ్యక్తం చేశారు. 2రోజులుగా నేను మహబూబ్ నగర్ లోనే ఉన్నా. గత అర్ధ రాత్రి 3 గంటలకు కిచెన్ కిటికీ తీసి ఇంట్లోకి వచ్చారు. ఇల్లంతా ఒక గంటన్నర పాటు కలియతిరిగారు .ఆదివారం ఉదయం 6 గంటలకు నాకు తెలిసింది. కిచెన్ లో కెమెరా కట్ చేశాడు, కింద గ్లాస్ తీసేసి ఇంట్లోకి వచ్చాడు . ముఖానికి మాస్క్, గ్లౌస్, బ్యాగ్ ,షూ ధరించాడు. ఫస్ట్ ఫ్లోర్ లోకి వెనుక భాగం నుంచి కిచన్ కిటికిలోంచి లోనికి ఎంటర్ అయ్యాడు. నక్కి నక్కి తిరుగుతూ రెక్కీ చేసిన తీరు అనుమానాలకు తావిస్తోంది. కిచెన్ లో కెమెరా కట్ చేశాడు . డైనింగ్ హాల్ లో కెమెరా తిప్పేసాడు. డ్రాలు తెరిశాడు, అన్ని చిందర వందర పడేశాడు. ఫస్ట్, సెకెండ్ ఫ్లోర్లలోని అన్నిరూములు తిరిగాడు . సెకెండ్ ఫ్లోర్ లోకి వెళ్ళాడు అంతా కలియ తిరిగాడు. నక్కుకుంటూ.. నక్కు కుంటు వెళ్ళిపోయాడు. తెల్లవారు జామున 4:30నిమిషాలకు ఇంట్లోంచి వెళ్లిపోయాడు. గంటన్నర పాటు వాడు నా ఇంట్లో ఏం రెక్కీ చేశాడో అర్థం కావడం లేదు. ఈ ఘటన ఊహించుకుంటేనే భయం వేస్తోంది. వాడు వచ్చినప్పుడు ఇంట్లోవాళ్లు ఎవరైనా చూసి ఉంటే.. చంపేసేవాడేమో.. ఏం జరిగేదో ఊహించుకుంటేనే భయం వేస్తోంది అంటూ మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ ఆందోళన వ్యక్తం చేశారు.

**చిన్న కర్చీఫ్ కూడా పోలేదు.**

నా ఇంట్లోంచి చిన్నకర్చిఫ్‌కూడా పోలేదు. నా ఇంట్లో దొంగతనానికే వచ్చి ఉంటే ఏదోటి తీసుకెళ్లాలి కదా. ఈ ఘటన తర్వాత నా ఇంట్లో నుంచి ఎలాంటి వస్తువులు పోలేదు. ఇంట్లో ఎలాంటి విలువైన వస్తువులు ఏమి పోలేదు. తెర్చి ఉన్న అన్ని రూమ్‌లలోకి తిరిగాడు. దొంగతనం చేయడానికి వస్తే ఏదో ఒకటి చేసి పోవాలి. మా మనమరాలి రూమ్ లోకి వెళ్ళాడు. ఆ సమయంలో ఆమెకు మెలకువ వచ్చి ఉంటే ఏం చేసే వాడో.. నా ఇంట్లో పని చేసే ముగ్గురు కూడా అమ్మాయిలే. వాళ్లకు మెలకు వచ్చినా ఏం జరిగేదోనని భయం వేస్తోంది. ముఖ్యమంత్రి ఉండే లేన్ లోనే నేను ఉంటాను. అయినా ఇలా దుండగులు చొరబడటం భయాందోళనకు గురి చేస్తోంది. ఈ విషయంపై ముఖ్య మంత్రి సీరియస్ గా దృష్టి సారించాలి. జాతీయ రాజకీయాల్లోనూ కీలక నేతగా ఉన్న నా ఇంట్లోనే ఈ పరిస్థితి ఉంటే ... భద్రత ఎక్కడ?



## భద్రత పెంచాల్సిందే..

**నా ఇంట్లోకి దుండగుడు చొరబడిన విషయమై ఇప్పటికే పోలీసులకు కంప్లైంట్ ఫైల్ చేశాను. నాకు సెక్యూరిటీపై సీఎం స్పందించాలి. - ఇంటెలిజెన్స్ ఐజీతో కూడా మాట్లాడాను. జరిగిన విషయం చెప్పి హైసెక్యూరిటీ భద్రత కల్పించాలని కోరాను. గత కొన్ని రోజుల క్రితమే నా భర్తకు గన్ మెన్స్ విషయం కూడా లేఖ రాశాను. సీఎం కూడా ఈ ఘటనపై సీరియస్ గా స్పందించాలి. నా ఇంటి వద్ద హై సెక్యూరిటి భద్రత పెంచాలి. అసలు నా ఇంట్లోకి చొరవబడింది ఎవరు..? ఎందుకొచ్చారన్న విషయంపై చాలా అనుమానాలు కలుగుతున్నాయి. నాకు ఏదైనా ప్రాణ హాని తల పెట్టాలని చూస్తున్నారా..? ఈవిషయంపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉందని డికె అరుణ డిమాండ్ చేశారు.**



# నటుడు విశ్వక్ సేన్ ఇంట్లో చోరీ

- జూబ్లీహిల్స్ ఫిల్మ్ నగర్ లో సంచలనం
- రూ.2.20 లక్షల బంగారు ఆభరణాలు మాయం
- బైక్ మీద వచ్చి.. 20 నిమిషాల్లోనే చోరీ చేసి జంప్

**హైదరాబాద్, మహా:** హీరో విశ్వక్ సేన్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. హైదరాబాద్ ఫిలింనగర్ రోడ్డు నెంబర్ 8లోని తమ ఇంట్లో చోరీ జరిగినట్టు విశ్వక్ సేన్ తండ్రి కరాటే రాజు ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబమంతా ఒకే ఇంట్లో నివాసముంటుండగా.. విశ్వక్ సేన్ సోదరి వన్మయి బెడ్ రూమ్ మూడో అంతస్తులో ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున తన గదిలో వస్తువులన్ని చిందరవందరగా పడి ఉండడం గమనించింది వన్మయి. బెడ్ రూమ్‌లోని వాతావరణం చూసి అనుమానం వచ్చిన ఆమె.. అల్మారాలు పరిశీలించగా.. పలు బంగారు ఆభరణాలు కనిపించకపోవటంతో దొంగతనం జరిగినట్టు గుర్తించింది. దీంతో.. ఈ విషయాన్ని తన తండ్రి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలాన్ని చేరుకున్నారు. క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. ఇంటి పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. తెల్లవారుజామున 5 గంటల 50 నిమిషాల ప్రాంతంలో.. ఒక గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చినట్టుగా పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి గేటు తీసుకుని నేరుగా మూడో అంతస్తుకు వెళ్లి.. వెనుక డోర్ నుంచి విశ్వక్ సేన్ సోదరి వన్మయి బెడ్‌రూంలోకి వెళ్లి.. అల్మరాలో నుంచి బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు గుర్తించారు. సరిగ్గా 20 నిమిషాల్లోనే.. ఆ దుండగుడు తన పని ముగించుకుని వెళ్లి పోయినట్టు సీసీటీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. ఈ చోరీలో రెండు డైమండ్ రింగులు పోయినట్టు సమాచారం. అయితే.. చోరీకి గురైన ఆభరణాల విలువ రూ.2.20 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# ఓటమి భయంతోనే తమిళనాడులో కొత్త డ్రామా

## ప్రజా విశ్వాసం కోల్పోయిన స్టాలిన్ ప్రభుత్వం

### ప్రాంతీయ విద్వేషాలతో పబ్బం గడుపుకోవాలను కోవడం దారుణం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**మహా :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ డీలిమిటేషన్, త్రిభాష విధానంపై రాజకీయం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. త్రిభాషా విధానంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి 'దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని డీఎంకే వితండవాదం చేస్తోంది. డీలిమిటేషన్, జాతీయ విద్యావిధానంపై దివాలాకోరుతనంతో డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. 2026 తమిళనాడు ఎన్నికల్లో ఓటమి నుంచి తప్పించుకోవడానికి డీఎంకే తప్పుడు ప్రచారం చేస్తోంది. దీన్ని బూచిగా చూపించి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. స్టాలిన్ పాలనపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని, ప్రత్యామ్నాయం వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. తమిళనాడులో లిక్కర్ కుంభకోణం తెరపైకి వచ్చిందని, దీంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. డీఎంకే నేతలు కోట్ల రూపాయలు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయంటూ లిక్కర్ స్కాం దృష్టి మళ్లించడానికే డీఎంకే దక్షిణాదికి అన్యాయం అనే వాదనను లేవనెత్తిందని కిషన్ రెడ్డి విరుచుకుపడ్డారు. త్రిభాషా విధానం బ్రిటిష్ కాలం నుంచే అనేక సంవత్సరాలుగా అమలు జరుగుతోందని, ఇప్పుడేదో ప్రధాన మంత్రి నరేదం◌ మోడీ కొత్తగా అమలు చేస్తున్నారన్నట్లుగా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. త్రిభాషా విధానంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. ఎన్నికల ఎత్తుగడలో భాగంగా ఓటమి భయంతో స్టాలిన్ బురద జల్లుతున్నారు అని వ్యాఖ్యలు చేశారు. స్టాలిన్కు వంత పాడే విధంగా రేవంత్ రెడ్డి, కేసీఆర్ లు వ్యవహరించడం దారుణమన్నారు. ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టి ప్రజల్లో విద్వేశాలను రేకెత్తించేలా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు.

**ఆరు గ్యారంటీలపై బడ్జెట్ లో స్పష్టత ఇవ్వాలి**

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు విషయంలో రేపు అసెంబ్లీలో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ లో స్పష్టత ఇవ్వాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం అలవి కాని హామీలిచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఖజానా ఖాళీ, అప్పుల విషయం తనకు తెలియదని బుకాయించడం దారుణమన్నారు. అప్పుల నెపంతో హామీల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించడం సరైంది కాదన్నారు. ఎన్నికల సందర్భంగా అనేక సభలలో రాష్ట్ర అప్పులపై మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అప్పుల గురించి తెలియదని అబద్ధాలు మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు.

# ఏఆర్ రహమాన్ అస్వస్థత, ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్

### స్వల్ప అస్వస్థతకు గురయ్యారన్న అపోలో వైద్యులు

### ఏఆర్ రహమాన్ ఆరోగ్యంపై తమిళనాడు సీఎం పోస్ట్



**మహా :** భారత దిగ్గజ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఉదయం ఆయనకు ఛాతిలో నొప్పిరావటంతో హుటాహుటిన చెన్నైలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఆయనను వైద్యులు ఎమర్జెన్సీ వార్డులో ఉంచి చికిత్స అందించారు. ప్రత్యేక వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. డాక్టర్లు రెహమాన్‌కు యాంజియోగ్రామ్, ఈసీజీ వంటి టెస్టులు నిర్వహించి డిహైడ్రేషన్, మెడకు సంబంధించిన ఇబ్బందులను ఎదుర్కుంటున్నట్లు నిర్ధారించారు. కొద్ది పాటి చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆ తర్వాత ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అస్వస్థతకు గురైన రహమాన్ ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారని తెలియడంతో ఆయన అభిమానులు కలవరపాటుకు గురయ్యారు. అయితే, తీవ్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరారనే వార్తలను ఆయన సోదరి రిహానా ఖండించారు. డిహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సంబంధిత సమస్యల కారణంగా అప్పటికప్పుడు ఆస్పత్రికి వెళ్లామని ప్రకటించారు. ఈ విషయాన్ని నిర్ధారిస్తూ అపోలో ఆస్పత్రి యాజమాన్యం ఒక ప్రకటన కూడా విడుదల చేసింది. డీహైడ్రేషన్ లక్షణాలతో ఆస్పత్రిలో చేరిన ఏఆర్ రెహమాన్‌కు రొటీన్ చెకప్స్ నిర్వహించి డిశ్చార్జి చేస్తున్నట్లు వెల్లడించారు.

**ఏఆర్ రెహమాన్ ఆరోగ్యంపై సీఎం స్టాలిన్ అప్‌డేట్**

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ ఛాతీనొప్పితో ఆసుపత్రిలో చేరాడన్న వార్తల నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో అప్‌డేట్ ఇచ్చారు. రెహమాన్ ఆరోగ్యంగా ఉన్నారన్నారు. "అనారోగ్యంతో ఏఆర్ రెహమాన్ ఆసుపత్రిలో చేరారనే వార్త తెలియగానే డాక్టర్లను సంప్రదించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాను. రెహమాన్ ఆరోగ్యంగా ఉన్నారని, త్వరలోనే ఆయనను ఇంటికి పంపుతామని వైద్యులు తెలిపారు" అని స్టాలిన్ రహమాన్ డిశ్చారిజికి ముందు ఎక్స్ లో పేర్కొన్నారు.




# రుణమాఫీ జరగలే

## నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

## సీఎం రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్

**మహా :** అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రసంగంలో సీఎం రేవంత్ రెడ్డి అన్న అబద్◌ాలే మాట్లాడారని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు మండిపడ్డారు. మధిర, కొడంగల్, సిద్దిపేట ఏ ఊరుకు పోదాం? సంపూర్ణ రుణమాఫీ జరిగింది అంటే ముక్కు నేలకు రాస్తా.. లేదంటే మీరు రాయండి అంటూ ముఖ్యమంత్రికి సవాల్ చేశారు. ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఎప్పటి లోగా సంపూర్ణ రుణమాఫీ చేస్తారో చెప్పాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న రేవంత్ భాష వల్ల తెలంగాణ పరువు పోతుందన్నారు. అలాగే, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ అని అన్నారు. కాంగ్రెస్ ముసుగులో ఉన్న బీజేపీ మనిషిలా రేవంత్ సభలో మాట్లాడారని ఆరోపించారు. సీఎం బూతులకు జీఎస్టీ వేస్తే రాష్ట్ర ఖజానా మొత్తం సరిపోదని సెటైర్లు వేశారు. కేసీఆర్ చావును కోరుకున్న రేవంత్.. ఆ తర్వాత మాట మార్చి బీఆర్ఎస్ ను అన్నానని చెప్పడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జానారెడ్డిని కేసీఆర్ ఎప్పుడూ గౌరవంగా సంబోధించేవారని గుర్తు చేశారు. ఎలాంటి తప్పు చేయకున్నా జగదీశ్ రెడ్డిని ఏకపక్షంగా సస్పెండ్ చేయడం దారుణమని ఆయన అన్నారు. రాష్ట్రం పట్ల ప్రస్తుత సర్కారుకు బాధ్యత లేని కారణంగానే ప్రాజెక్టులు అగ్గిపెట్టెల్లా కూలిపోతున్నాయని, పంటలు ఎండిపోతున్నాయని హరీశ్ రావు దుయ్యబట్టారు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల రైతులు, చేనేత కార్మికులు, ఆటో కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం చేయడం కోసం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు ప్రభుత్వం వెంటపడతామని అన్నారు. రైతులకు రూ.15 వేల రైతు బంధు డబ్బులు పడే వరకు రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు పట్ల కేసీఆర్ కు, బీఆర్ఎస్ పార్టీకి బాధ్యత ఉందని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్రాన్ని జీఎస్డీపీలో నంబర్ వన్ గా, తలసరి ఆదాయంలో అగ్రస్థానంలో నిలిపామని గుర్తు చేశారు. విద్యుత్ వినియోగంలో, వరి ధాన్యం ఉత్పత్తిలోనూ రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపామని చెప్పారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించి దేశానికే ఆదర్శంగా నిలిచామన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను బాగు చేసి దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రైతు బంధు పథకాన్ని ఐక్య రాజ్య సమితి సైతం ప్రశంసించిందని గుర్తు చేశారు. హైదరాబాద్ లో అందాల పోటీలు పెడతామంటున్న సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల పోటీ పెడితే విజయం తథ్యమని హరీష్ రావు వ్యాఖ్యానించారు.

# రేవంత్ కేసీఆర్‌లా తయారయ్యారు

(మొదటిపేజీ తరువాయి)



'రేవంత్ చేసిన ఏకపాత్రాభినయం నిన్న అసెంబ్లీలో చూశామన్నారు. రేవంత్ కాలేజీ రోజుల్లో ఇలాంటి ఏకపాత్రాభినయం చేసినట్లున్నాడని వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగంపై ప్రశ్నిస్తే.. ఎక్కడా సమాధానం చెప్పకుండా దాటవేశారని మండిపడ్డారు. జవాబులు చెప్పకుండా కేవలం ఎదురుదాడి చేయడమే కనిపించిందని, పసలేని, స్కూలర్ లేని ఏకపాత్రాభినయ మాత్రమే రేవంత్ చేశారన్నారు. శాసనసభలో 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తానని రేవంత్ హామీ ఇచ్చారని, ఏ హామీలు గెలిపించాయో.. ఆ గ్యారెంటిలకే చట్టబద్ధత లేకుండా పోయిందన్నారు. సభ ఇంకా కొనసాగుతోందంటూ 6 గ్యారెంటీలు, ఇచ్చిన హామీలు, అభివృద్ధి అంశాలపై చర్చకు సిద్ధమా? అని అడిగారు. తెలంగాణ ప్రజలకు ముఖం చూపించలేని దుస్థితిలో రేవంత్ సర్కార్ ఉందని ఏలేటి వ్యాఖ్యానించారు. అభివృద్ధిని ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయా? ఇంకా ఎవరైనా అడ్డుకుంటున్నారా అనేది చెప్పాలన్నారు. రుణమాఫీ పూర్తిచేశామని గవర్నర్ తో అబద్ధాలు చెప్పించారని ఏలేటి మండిపడ్డారు.

# పాక్‌తో శాంతికి యత్నించినప్పుడల్లా ద్రోహం విద్వేషాన్నే చూశాం

## ఇప్పటికైనా శాంతి మార్గాన్ని పాక్ ఎంచుకోవాలి

### ట్రంప్‌కు 'అమెరికా ఫస్ట్'.. నాకు 'ఇండియా ఫస్ట్'

### ప్రధాని నరేంద్ర మోదీ

(మొదటిపేజీ తరువాయి)

కనీసం ఇప్పటికైనా శాంతి మార్గాన్ని పాక్ ఎంచుకుంటుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాకు చెందిన ప్రఖ్యాత యూట్యూబర్, ఏఐ శాస్త్రవేత్త లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో పాడ్ కాస్ట్‌లో భారత ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. మూడు గంటల నిడివి కలిగిన ఈ సుదీర్ఘ పాడ్‌కాస్ట్ వీడియోను ఆదివారం ఫ్రిడ్‌మన్ విడుదల చేశారు.



**పాకిస్తానీలూ శాంతి కోసం ఎదురు చూస్తున్నారు**

"బహుశా పాకిస్తాన్ ప్రజలు కూడా శాంతి కోసం ఎదురు చూస్తుండొచ్చు. వాళ్లు కూడా అశాంతితో, ఉగ్రవాద చర్యలతో అలసిపోయి ఉంటారు. ఉగ్రవాదం వల్ల పాక్‌లో అమాయక పిల్లలు చనిపోతున్నారు. ఎంతోమంది ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి" అని మోదీ పేర్కొన్నారు. "సార్క్ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చిన సందర్భంలో అన్ని దేశాలతో పాటు పాక్‌ను కూడా మేం సాదరంగా ఆహ్వానించాం. నాటి భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చాలా హుందాగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. మా ఆహ్వానంతో ఆనాడు సార్క్ సదస్సుకు నవాజ్ షరీఫ్ హాజరయ్యారు. భారత్ విదేశాంగ విధానంలో మేం స్పష్టతను తీసుకొచ్చాం. మునుపెన్నడూ ఇలాంటి ప్రయత్నాలను ఎవరూ చేయలేదు. శాంతి, సౌభ్రాతృత్వాలకే మేం పెద్దపీట వేశాం. అయినా పాక్ వైపు నుంచి ఆశించిన ఫలితం మాకు రాలేదు" అని మోదీ చెప్పారు.

**విమర్శలను స్వీకరిస్తా**

విమర్శ అనేది ప్రజాస్వామ్యానికి ఆత్మవంటిదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తాను విమర్శలను స్వాగతిస్తానని, అవి మరింత పదునుగా ఉండాలన్నారు. అమెరికాకు చెందిన కృత్రిమ మేధ పరిశోధకుడు లెక్స్‌ఫ్రిడ్‌మ్యాన్ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోదీ అనేక అంశాలపై మాట్లాడారు. "నా శక్తి పేరులో లేదు. 140 కోట్ల మంది భారతీయుల మద్దతు, దేశ సంస్కృతి, వారసత్వంలోనే ఉంది. నేను ప్రపంచ నేతలతో చేయి కలిపినప్పుడు, అది మోదీ చేస్తున్నది కాదు. 140 కోట్ల మంది భారతీయులు చేస్తున్నట్లే. శాంతి గురించి మేం మాట్లాడినప్పుడు, ప్రపంచం మా మాట వింటుంది. ఎందుకంటే గౌతమ బుద్ధుడు, మహాత్మాగాంధీ జన్మించిన నేల ఇది" అని మోదీ అన్నారు.

**చైనాతో ఆరోగ్యకర పోటీ**

చైనాతో సంబంధాలపై మాట్లాడుతూ, భారత్, చైనాలు ఆరోగ్యకరమైన పోటీతత్వంతో ముందుకెళ్లాలని కోరుకుంటున్నామని ప్రధాని మోదీ అన్నారు. పోటీతత్వం చెడు కాదని, అది ఎన్నడూ సంఘర్షణకు దారి తీయకూడదని అయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ శ్రేయస్సు కోసం ఇరు దేశాల సహకారం ఎంతో అవసరమని మోదీ ఉద్ఘాటించారు.

**ట్రంప్‌నకు 'అమెరికా ఫస్ట్- నాకు 'ఇండియా ఫస్ట్'**

"రెండోసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పటి నుంచి డొనాల్డ్ ట్రంప్ అత్యంత అప్రమత్తతతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమెరికా ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చే దిశగా ఆయన అడుగులు వేస్తున్నారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో ఉండగా హత్యాయత్నం జరిగినా, ట్రంప్ ఆత్మస్థైర్యం ఏమాత్రం చెక్కు చెదరలేదు. ఆయన అంకితభావం అలాంటిది. ఇటీవలే అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు నేను ట్రంప్ ప్రభుత్వంలోని టీమ్‌ను కలిశాను. వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసీ గబార్డ్, ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామిలతో భేటీ అయ్యాను. ట్రంప్ విజన్‌ను సాకారం చేయడంలో ఆ టీమ్ విజయవంతం అవుతుందని నేను భావిస్తున్నా" అని భారత ప్రధాని మోదీ చెప్పారు. "2019 సెప్టెంబరులో హ్యూస్టన్‌లో ఉన్న ఎన్ఆర్‌జీ స్టేడియంలో హౌడీ మోదీ కార్యక్రమం జరిగింది. అందులో నేను ప్రసంగిస్తుంటే, ఆడియన్స్‌లో కూర్చొని ట్రంప్ ఆసక్తిగా విన్నారు. అది ఆయన గొప్పతనం. ఆ క్షణాలు నాకు బాగా గుర్తున్నాయి" అని ఆయన గుర్తు చేసుకున్నారు. "ఆడియన్స్‌కు అభివాదం చేసేందుకు ఎన్ఆర్‌జీ స్టేడియంలో తిరుగుదామని నేను చెప్పగానే ట్రంప్ అంగీకరించారు. సెక్యూరిటీని తగ్గించుకొని మరీ నాతో కలిసి నడిచారు. నాపై ఆయనకు అంతటి విశ్వాసం ఉంది. ఇద్దరి బంధం అంత బలంగా ఉంది" అని మోదీ తెలిపారు. "అంత పెద్ద హత్యాయత్నం జరిగిన తర్వాత కూడా అమెరికా కోసమే ట్రంప్ పనిచేస్తున్నారు. ఆయనకు దేశమంటే అంత ప్రేమ. నేను కూడా ఇండియా ఫస్ట్ నినాదాన్ని నమ్ముతాను" అని భారత ప్రధాని చెప్పుకొచ్చారు.

**ఆర్ఎస్ఎస్ లో జీవనవిలువలు నేర్చుకున్నా**

'నేను జీవన విధానం, జీవన విలువల గురించి ఆర్ఎస్ఎస్‌లో నేర్చుకున్నాను. పరమార్థంతో కూడిన జీవితాన్ని పొందాను. ఆర్ఎస్ఎస్ సమావేశాలకు చిన్నపిల్లాడిలా హాజరవడం అంటే నాకెంతో ఇష్టం. దేశానికి ఏదో ఒక విధంగా ఉపయోగపడాలని నాకు సంఘ్ నేర్పింది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.



# ఇరాన్ బీచ్‌లో బ్లడ్ రెయిన్

### రక్త ప్రవాహంలా సముద్రంలోకి చేరుతున్న వర్షపు నీరు

### ఎరుపు వర్ణంలోకి మారిన తీర ప్రాంతం

**మహా :** ఇరాన్ లోని రెయిన్ బో ఐలాండ్ లో రక్తంలా ఎర్రని రంగులో వర్షం కురిసింది. ఆకాశం నుంచి ధారగా కురుస్తున్న వర్షం అక్కడి కొండలపై చేరగానే ఎరుపు వర్ణంలోకి మారిపోతోంది. అది రక్తపు నీరులా ప్రవహించి సముద్రంలోకి చేరుతోంది. దీంతో బీచ్ మొత్తం ఎరుపు రంగులోకి మారి భయపెడుతోంది. ఏటా ఈ దృశ్యం చూసేందుకు లక్షలాదిగా పర్యాటకులు ఇరాన్ లో వాలిపోతుంటారు. తాజాగా కొంతమంది టూరిస్టులు రెయిన్ బో ఐలాండ్ లో వర్షాన్ని ఎంజాయ్ చేశారు. ఎరుపు రంగులో రక్తాన్ని తలపించేలా పారుతున్న వరద నీటిలో గంతులు వేశారు. సముద్ర తీరంలోని గుట్టలపై పడిన వర్షం జలపాతంలా కిందకు దూకుతుంటే కేరింతలు కొట్టారు. ఈ ఎర్రని ప్రవాహాన్ని ఓ నెటిజన్ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో ఈ వీడియో వైరల్ గా మారింది. పకృతిలోని వింతలకు ఇదొక ఉదాహరణ అని, ఉన్నఫళంగా అక్కడికి చేరాలని ఉందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. రెయిన్ బో ఐలాండ్ ప్రాంతంలో చాలా ఏళ్ల క్రితం ఓ అగ్ని పర్వతం ఉండేదని, దాని నుంచి వెలువడిన లావా చల్లారి ఈ దీవి ఏర్పడిందని ఇరాన్ చరిత్రకారులు చెబుతున్నారు. అక్కడి మట్టిలో ఐరన్ ఆక్సైడ్ కంటెంట్ చాలా అధిక మోతాదులో ఉంటుందని, వర్షపు నీరు రక్త వర్ణంలోకి మారడానికి కారణం ఇదేనని వివరణ ఇచ్చారు. ఈ అరుదైన దృశ్యాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు రెయిన్ బో ఐలాండ్ కు వస్తుంటారని చెప్పారు

## సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామికి స్వర్ణ పుష్పార్చన

**విశాఖ,సింహాచలం,మహా:** శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామి వారి సింహాచలం దేవస్థానం వద్ద వైభవంగా స్వామివారి స్వర్ణ పుష్పార్చన కార్యక్రమం ఆలయ వైదిక సిబ్బంది ,ఆలయ అధికారులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తముగా జరిగింది. శ్రీ స్వామివారికి 108 బంగారు సంపెంగలతో అత్యంత వైభవంగా స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఈ స్వర్ణపుష్పార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. స్వర్ణపుష్పార్చణ అత్యంత వైభవంగా, సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధిష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణపుష్పార్చన, సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు.



### గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను

## నివృత్తి చేయాలి

### ఎమ్మెల్సీ కవిత



**మహా :** గ్రూప్1 పరీక్షలు, ఫలితాలపై అభ్యర్థులు లేవనెత్తుతున్న అనుమానాలను ప్రభుత్వంతో పాటు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నివృత్తి చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పేపర్ల మూల్యాకనంలో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. ట్రాన్స్‌లేషన్ సమస్య వల్ల ప్రొఫెసర్లు, డిగ్రీ కాలేజీ లెక్చరర్లు సరిగ్గా మూల్యాంకనం చేయలేకపోయారని, తద్వారా మార్కుల్లో వ్యత్యాసాలు వచ్చాయని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారని ఆమె వివరించారు. గ్రూప్1 పరీక్షల్లో ప్రిలిమ్స్‌కి ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్‌కి మరొక హాల్‌టికెట్ నంబర్ కేటాయించడం వల్ల విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని ప్రస్తావించారు. ఇటీవల పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్ 2 ఫలితాల్లో దాదాపు 13 వేల మంది అభ్యర్థుల ఫలితాలు వెల్లడించలేదని, ఏ కారణం చేత 13 వేల మందిని ఇన్వాలీడ్‌గా ప్రకటించిందో చెప్పాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. గ్రూప్ పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో 11 విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీ కవితను కలిసి చర్చించారు. తాము వ్యక్తపరుస్తున్న అనుమానాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు.

## సేవకు ప్రతిరూపాలు ఆర్యవైశ్యులు

### రాజకీయాల్లోకి రావాలన్న ఎంపీ రఘునందన్ రావు

**మహా :** సామాజిక సేవలో ముందుండే ఆర్యవైశ్యులు రాజకీయాల్లోకి రావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు కోరారు. ఆదివారం హైదరాబాద్ లో ఆర్యవైశ్యుల మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో ఆర్యవైశ్యులు రకరకాల పేర్లతో పిలవబడతారని, సేవాగుణంలో అందరికంటే ముందు ఉంటారని పేర్కొన్నారు. అంతటి సేవాగుణం, ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న ఆర్యవైశ్యులు రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు. దేశ రాజకీయాల్లో మార్పు కోసమే భారతీయ జనతా పార్టీ పుట్టిందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అపర చాణక్యుడు అని, 25 కోట్ల మంది భారతీయులను పేదరికం నుంచి బయటికి తీసుకువచ్చారని తెలిపారు. మోడీ 3 సార్లు ప్రధాని కావడానికి తాను ఎంతో సహకరించినట్టు తెలిపారు. భవిష్యత్తులో ప్రపంచాన్ని నడిపేది మోడీ వంటి రాజకీయ నాయకులే అనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని రఘునందన్ రావు పేర్కొన్నారు.



## లిఫ్ట్ ప్రమాదాలకు చెక్..

### త్వరలో రేవంత్ సర్కార్ చట్టం

**హైదరాబాద్, మహా:** వరుస లిఫ్ట్ ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో దీనిపై కఠినచట్టాన్ని చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించింది . బహుళ అంతస్తుల నిర్మాణాలు పెరిగినందున లిఫ్టుల వినియోగం కూడా పెరిగింది. కేవలం షాపింగ్ మాల్స్, హోటల్స్, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనే కాకుండా గెటెడ్, వ్యక్తిగత గృహాల్లోనూ లిఫ్టులు/ఎస్కలేటర్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే లిఫ్టుల తయారీ కంపెనీలపై చాలామందికి అవగాహన లేదు. ఇక బిల్డర్ల గురించి చెప్పనక్కరలేదు. నిర్మాణ ఖర్చులను తగ్గించుకునేందుకు చాలామంది తక్కువ ధరకు లభించే నాణ్యత లేని లిఫ్ట్ పరికరాలను కొనుగోలు చేసి అమర్చుతున్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాక లిఫ్ట్ ఇండస్ట్రీపై ఎలాంటి ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు పెరిగిపోతున్నాయి. ఈ ప్రమాదాలకు చెక్ పెట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే ఏపీ, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ల్లో అమల్లో ఉన్న లిఫ్ట్ పాలసీని తెలంగాణలోనూ తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నెల 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లిఫ్ట్ అండ్ ఎస్కలేటర్స్ బిల్లు2025ను అసెంబ్లీ ఆమోదించింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోనూ లిఫ్ట్ పాలసీని వేగవంతంగా అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.దీనిపై అవగాహన అధ్యయనం, ముసాయిదా రూపకల్పన కోసం ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ లిఫ్ట్ యాక్ట్- 2015 ముసాయిదాకు మెరుగులు దిద్దాలని ఆదేశించింది. అలాగే, ఇతర రాష్ట్రాల్లో పాలసీ ఏ విధంగా ఉందనే అంశంపై ఆరా తీసే పనిలో తెలంగాణ ప్రధాన విద్యుత్ తనిఖీ విభాగం నిమగ్నమైంది.

## రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

### యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



**అనకాపల్లి జిల్లా, యలమంచిలి, మహా:** రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్ టి బి ఎల్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గంలో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలలోకూటమి ప్రభుత్వం చొరవతో అనేక పరిశ్రమలు వస్తుండడంతో అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. రాష్ట్రంలో యలమంచిలి నియోజకవర్గం అభివృద్ధి పరంగా నంబర్ వన్ నియోజకవర్గంగా అయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## పెట్టుగొళ్లపల్లిలో ఘనంగా జనసేన జెండా ఆవిష్కరణ

**అనకాపల్లి జిల్లా,ఎస్.రాయవరం మహా :** పాయకరావుపేట నియోజకవర్గం ఎస్ రాయవరం మండలం పెట్టు గొళ్లపల్లి గ్రామంలో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి శ్రీ గెడ్డం బుజ్జి హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని చిత్రాడలో 12వ పార్టీ ఆవిర్భావ సభ జరిగిన అనంతరం పాయకరావుపేట నియోజకవర్గంలో పెట్టుగొళ్ళపల్లిలో జెండా ఆవిష్కరణ జరగడం ఆనందంగా ఉందన్నారు. అలాగే మరో రెండు రోజుల్లో పాయకరావుపేట మండలంలో జరిగే మరో నాలుగు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలకు ఈ గ్రామ జనసైనికులు అందరూ హాజరై జెండా ఆవిష్కరణ కార్యక్రమవులను విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల మరణించి తన కళ్ళను దానం చేసిన జనసేన కార్యకర్త రౌతులపూడి రాజేష్ కి శ్రద్ధాంజలి ఘటించారు.

## ఉక్కపోతల మధ్య చల్లని కబురు

### ఆ రెండు రోజులు వర్షాలు

### సోమ, మంగళవారాలు వడగాలులు

**మహా :** ఎండలు దంచికొడుతున్న వేళ తెలంగాణ ప్రజలకు హైదరాబాద్ వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. మార్చి 21 నుంచి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. 21, 22 తేదీల్లో ఆయా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పింది. దీంతో ఎండల ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు కాస్త ఉపశమనం దొరకనుంది. మరోవైపు, తెలంగాణలో రేపు, ఎల్లుండి పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెప్పారు. ముఖ్యంగా ఆసిఫాబాద్, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపారు. కొన్ని రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం అయ్యే వరకు ఎండలు మండిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2024 వేసవితో పోల్చితే ఈ సారి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. సాధారణం కంటే 3.3 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దాదాపు 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటింది. ఆదిలాబాద్‌లో అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఎండలు, వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నం సమయాల్లో అవసరం ఉంటేనే బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత మరీ అధికంగా ఉంది. రానున్న వారం - పది రోజుల్లో మాత్రం కొద్దిగా భిన్నమైన వాతావరణం ఉండనున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మార్చి 19 వరకు వేడిగాలులు ఉంటాయని అంటున్నారు. ఆ తర్వాత అకాల వర్షాలు కురిస్తాయని చెబుతున్నారు.



## జగన్ ఏజెన్సీలో గంజాయి పెంచితే, చంద్రన్న కాఫీ తోటలు పెంచారు

- అరకు కాఫీని ప్రపంచవ్యాప్తం చేసిన ఘనత చంద్రబాబుది.
- అభివృద్ధి సంక్షేమం, సామాజిక న్యాయ ప్రదాత
- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు



**విశాఖ ,గోపాలపట్నం ,మహా:** జగన్ ఏజెన్సీలో గంజాయి పెంచితే ,చంద్రన్న కాఫీ తోటలు పెంచారని అరకు కాఫీని ప్రపంచవ్యాప్తం చేశారని ప్రభుత్వ విప్ ,పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. అభివృద్ధి సంక్షేమం , సామాజిక న్యాయ ప్రదాత చంద్రబాబు నాయుడు 47 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై పత్రికా సమావేశం నిర్వహించిన ఆయన సందర్భంగా మీడియా తో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు శాసనసభలో తొలి ప్రమాణ స్వీకారానికి చేసినేటికి 47 ఏళ్లు పూర్తయిందన్నారు. శాసనసభ్యునిగా మొదటి ప్రమాణ స్వీకారం: 15 మార్చి 1978న మొదటిసారిగా ఎమ్మెల్యేగా చంద్ర బాబు శాసనసభలో ప్రమాణస్వీకారం చేసారని గుర్తు చేశారు. 41 సంవత్సరాలపాటు ఎమ్మెల్యే గాను 15 సంవత్సరాలు ముఖ్యమంత్రి గానుపనిచేస్తూ నేటికి ముఖ్యమంత్రి గా కొనసాగుతున్నారు అని పేర్కొన్నారు. ఈ రికార్డు ఏపీ చరిత్రలో ప్రథమస్థానం. అని తెలిపారు. అభివృద్ధి , సంక్షేమం ,సామాజిక న్యాయం చేయడంలో బహుముఖ ప్రజ్ఞ చూపడం వల్లనే ఇంత సుదీర్ఘకాలం చంద్రబాబును ప్రజలు ఆదరించారన్నారు. విజన్ 2020 నిజమై లక్షలాది ఉద్యోగాలు కల్పించి సంపద సృష్టించింది చంద్రబాబు నాయుడు మాత్రమే అని కొనియాడారు .నేడు స్వర్ణాంధ్ర విజన్ 2047తో పౌరుల తలసరి ఆదాయం 35 లక్షలకు పెంచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సైబరాబాద్, ప్రజా రాజధాని అమరావతి, పోలవరం సృష్టికర్త. , అభివృద్ధి ప్రధాత ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల యువత 30 లక్షల మందికి సైబరాబాద్ ఉద్యోగాలు, ఉపాధి కల్పించిన వ్యక్తి గా చంద్రబాబుకు మంచి గుర్తింపు దక్కిందన్నారు.. ఐటీ విప్లవం తెచ్చి తెలుగుబిడ్డల్ని 100కు పైగా దేశాలలో పెద్ద ఉద్యోగస్తుల్ని చేసారని చెప్పారు. రాష్ట్రంలో 18 మంది సీయంలు స్థాపించిన విద్యుత్ స్థాపిత సామర్థ్యం సుమారు 5 వేల మెగావాట్లు చంద్రన్న ఒక్కరే 15 వేల మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లు స్థాపించారన్నారు. సమైక్య రాష్ట్రంలో 51 వేల కి.మీ., నవ్యాంధ్రలో ఇప్పటికి 35 వేల కి.మీ. రోడ్లు నిర్మించారని తెలిపారు. నెల్లూరు చెన్నై జాతీయ రహదారి నిర్మాణానికి బీజం వేసి నేటి జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రేరణ ఇచ్చిన ఘనత కూడా చంద్రబాబు కే దక్కుతుందన్నారు.వ్యాపార, పారిశ్రామిక రాయితీలు భారీగా ఇచ్చి సొంత కాళ్లపై నిలబెట్టిన నిజమైన సంక్షేమ సారధి చంద్రన్న అని కొనియాడారు. 12 లక్షల నాణ్యమైన ఇళ్లు నిర్మించి పేదలకు ఇచ్చారన్నారు. సామాజిక న్యాయానికి మారు పేరు చంద్రన్న అని తెలిపారు. మహిళలకు విద్య, ఉద్యోగాల్లో 33% రిజర్వేషన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో 33% రిజర్వేషన్ కల్పన, డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటిస్థానంలో నిలిపారని గుర్తు చేశారు.

# వెంటాడే ఆధునిక దళిత కథలు

తెలుగు సాహిత్య గమనమంతా రెండే మార్గాలు. చాతుర్వర్ణ కుల వ్యవస్థను పటిష్టపరిచేందుకు సృజించిబడిన సాహిత్యం ఒకటైతే, కులం గోడలను బద్దలు కొట్టిన సాహిత్యం మరొకటి. ఆ రెండో మార్గమే ఇవాళ మనం చూస్తున్న ఆధునిక సాహిత్యం. ఇందులో దళిత సాహిత్యానిది విస్మరించలేని పాత్ర. 1985ల తరువాత పెద్దమొత్తంలో విస్తరించిన దళిత సాహిత్యంలో ఆధునిక గొంతుకను వినిపిస్తున్న కలం, గళం డా.పసునూరి రవీందర్. 'అవుటాఫ్ కవరేజ్ ఏరియా' కథా సంపుటితో తెలంగాణ రాష్ట్రం నుండి తొలిసారి కేంద్ర సాహిత్య అకాడెమి యువపురస్కారం అందుకున్నాడు పసునూరి. ఆ తరువాత అదే మార్గాన్ని మరింత పటిష్టం చేస్తూ 'కండీషన్స్ అప్లయ్ ' కథా సంపుటి వెలువరించారు. ఈ కథా సంపుటికి ఇటీవల తెలంగాణ సారస్వత పరిషత్ వారి రాష్ట్ర స్థాయి ఉత్తమ కథా సంపుటి అవార్డు దక్కించుకుంది. ఈ సందర్భంగా ఈ కథలను ఒకసారి పరిచయం చేసుకుందాం.

బాబాగా ఆకలి నేపథ్యంలో చిత్రించిన కథలు తెలుగు సాహిత్యంలో లేకపోలేదు. కానీ పసునూరి రాసిన 'లీఫ్ మ్యాన్' కథ అందుకు భిన్నం. ఇందులో ఒకపక్క ఆకలిని చూపిస్తూ, మరోపక్క సమాజ తిరోగమన పోకడను చూపిస్తూ నవ్విస్తాడు రచయిత. దళితుడు పూజలందుకునేది కూడా ఓర్వలేక పోయినా గోపాల్ రెడ్డి దొరతనం, తన కుట్రలను బయటపెడతాడని భయంతో లింగడిని కడతేర్చడం మరోపక్క ఆవేదన కలిగించే ' లీఫ్ మ్యాన్ ' కథ. ఈ దేశంలో దళితుల ఆకలి చావులకన్నా దోపిడీ వర్గ కుట్ర వలన జరిగే పరువు హత్యలే ఎక్కువగా ఉంటాయేమో!. ఇందుకు నిదర్శనమే గ్లోబల్ హంగర్ ఇండెక్స్ సూచిలో భారత దేశ అట్టడుగు స్థానంలో ఉండటం. మన పొరుగు దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకన్నా మన దేశం కింద స్థాయిలో వుండటం దయనీయ స్థితికి ప్రతీక.

లీఫ్ మ్యాన్ కథకి ఇంకో కోణాన్ని చూపించే కథ' ప్యూర్లీ నాన్ వెజిటేరియన్ '. " నీచు తినే వాళ్లంతా నీచులే " శాఖాహారం సేవించడమే నాగరికత అని అనుకునే మిథ్యావాదులున్న మన దేశంలో, తినే ఆహారాన్ని బట్టి సగటు మనిషి యొక్క కులాన్ని పసిగట్టే దేశం, కులాన్ని చూసి మనిషికి విలువిచ్చే దేశం మనది. ఒకవేళ శాఖాహారమే గొప్పదైతే విదేశీ శాస్త్రవేత్తలకు ధీటుగా మనమెందుకు ఆవిష్కరణలు చేయటం లేదు? ఆదిమనవులెందుకు రాళ్ళు రెప్పలను ఆయుధాలుగా వాడారు ?.వాళ్ళ ఆహారమేంది?. మరీ నాగరికులంతా ఆదిమానవుల నుండి రాలేదా ?. ఆకాశం నుండి ఏమైనా ఊడి పడ్డారా ? అనే ప్రశ్నలు సంధించుకోవాలి. ఇది భిన్న సంస్కృతుల దేశం. ఎవరి ఆచారాలు వారివి, ఎవరి కట్టుబాట్లు వారివి, ఎవరి ఆహారపు అలవాట్లు వారివి, మీరు అవి తినకపోయినా పర్వాలేదుకానీ, ఎదుటి వారి ఆహారాన్ని తక్కువగా, నీచంగా చూడడం, చూపడం సంస్కారం కాదు " అని బల్లగుద్దినట్లు చెప్పిన ఏకాంబరం లాంటి దళిత బిడ్డలు వారి మీద రుద్దాలనుకునే యత్నాన్ని తిప్పికొట్టడం ద్వారా ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకున్నారు. ఈ కథ బీఫ్ పాలిటిక్స్ మాట్లాడుతూనే, భారతీయ విద్యా సంస్థల్లో కులవివక్షను కూడా కళ్లకు కట్టింది. కథలోని చివరి వాక్యం " ఈ దేశం చీలినట్టే .....ఆ తరగతి గది కూడా రెండుగా చీలింది " అంటారు రచయిత.






"బాలరాజు తల్లి శాంతమ్మ ... ఉస్మానియా క్యాంపసుకి, తన కొడుకుని ఆడపిల్లను పెళ్ళి చేసి పంపినట్టు పంపుతుందంటారు' రాచపుండు' కథలో . ఇందులో చాలా లోతైన ఆవేదన వుంది, క్యాంపస్ కి పోవటమే గగనమైతే, అక్కడ చదువుకుని ఇంటికి తిరిగి రావడం ఇంకో సాహసం. క్యాంపస్లో వారికి ఎదురయ్యే రకరకాల సిద్ధాంతాలు ఎలాంటి పరిణామాలకు గురిచేస్తాయో ఎవరికీ అంతుచిక్కదు. బజార్లో కొన్న ఎలక్ట్రిక్ వస్తువులకిచ్చే గ్యారంటీ కూడా దళిత బిడ్డల ప్రాణాలకు ఇవ్వలేము . ఈ విషయాన్ని ఉస్మానియా యూనివర్సిటీలో ఏ మాసిన గోడనడిగినా విరామం లేకుండా ఎపిసోడ్లు ఎపిసోడ్లుగా చెప్తుంది. నీళ్లు, నిధులు, నియామకాల ఆధారంగా ఏర్పడిన తెలంగాణ, అందుకు చేసిన పోరాటంలో బాలరాజు వంటి పద మూడు వందల మంది దళిత బిడ్డలు పెట్రోలు పోసుకుని బలి దానాలు చేస్తే చివరకు మట్టిపాలైన వైనాన్ని చూపుతారు రచయిత. దళితుల ప్రాణ త్యాగాల పునాదిగా ఏర్పడిన తెలంగాణలో కలలు సాకారమైందా అంటే లేదనే చెప్పాలి . ఇలాంటి అమరవీరుల తల్లుల కన్నీటి గోసే ' రాచపుండు' కథ.

దళితులు చదువుకుంటే బతుకులు మారతాయనుకుంటే కూలి ఇండ్లల్లో పుట్టి,కష్టపడి చదివి అత్యున్నత డిగ్రీ అయిన పీహెచ్డీ డాక్టరేటు పట్టా పొందిన కిరణ్ కూడా ఉద్యోగం లేని స్థితిలో , పీజీ, బీఈడీ చదివిన ఆడబిడ్డ.. రాని నోటిఫికేషన్స్ కొరకు ఏళ్ల తరబడి ప్రిపేరయ్యే చెల్లి, కుటుంబ కష్టాలు చూడలేక పనికి ఆహారం పథకం కింద కూలికి పోయినా దుర్మార్గం ఒక పక్క చూపిస్తూ, నిరుద్యోగ దుస్థితిలో నుండి బయటపడాలంటే ఇంకో ఉద్యమం అవసరముందంటూ జెజ్జనక తక జెజ్జనక తక ...జెజ్జనక తక ...జెజ్జనక తక ' మని డప్పు కొట్టిన డాక్టరేట్ నిస్సాయతను చూపుతారు. ' జెజ్జనక ...జెన్ ' కథలో. ఇదే కోవకు చెందిన యింకో కథ ' శివన్న రుణం ' తెలివి తేటలు వుండి, బాగచదువుకుని కూడా నిరుద్యోగం వలన ఆకలితో పోరాడి, బాధలకు తట్టుకోలేక తాగుడుకు బానిసై చనిపోయిన శివ కుమార్ సమాధి ఒకపక్క ఏడిపిస్తుంటే ......దళితుల బతుకులోను స్మశానంలోను ఇరుకు ఇరుకుగావుండే పేద స్థితిని చూపుతూ ...... దాని వెనుకవున్న మనిషి జీవితపు తత్వాన్ని బోధిస్తారు రచయిత .

"కులాంతర వివాహాలు మాత్రమే కులరహిత సమాజ నిర్మాణానికి తోడ్పడుతుందని" 'అన్నిహిలేషన్ ఆఫ్ క్యాస్ట్ ' అనే పుస్తకంలో చెప్పిన బాబా సాహెబ్ అంబేద్కర్ గారి మాటలు కులం పోయిందని చెప్పుకుంటున్న నేటి సమాజంలో కూడా అసాధ్యంగానే మిగిలిపోయింది. ఇందుకు నిదర్శనమే ప్రణయ్ అమృతల కుల అహంకార హత్య . ఒక దళిత అబ్బాయి లేదా అమ్మాయికి అగ్రకుల వారితో సంబంధం పెట్టుకోడానికి యీ కుల సమాజాం అంగీకరించటం లేదు. మాదిగ పెద్దమనిషి కట్టమల్లు కూతురు రాజవ్వని, వెంకట్ రెడ్డి కొడుకు నరేందర్ రెడ్డి వెంటపడి ప్రేమించి పెళ్ళి చేసుకుని ఊరోదిలి వెళ్లిపోతే, కట్టమల్లుకున్న ఒక టిన్నర ఎకరాల భూమిని వెంకటరెడ్డికి ఇవ్వలేదనే కక్షసాధింపు చర్యగా సమయం చూసి ఊరి నుండి వెలేసేసి, తన కొడుకు నరేందర్ రెడ్డిని మాత్రం కాపాడుకున్న దొరతనాన్ని చూపుతూ ....ఒక్కగానొక్క కూతురని మగరాయుడు లెక్క గాబారంగ పెరిగిన రాజవ్వ తిండి లేకుండా ఆకలికి అలమటించిన విషయాలు మనస్సుని కుదురుగా వుండన్నివ్వవు. ప్రేమించడానికి మనస్సు మాత్రమే కాదు కులం కూడా వుండాలా?. రాజవ్వ అవ్వ చనిపోతే కూడా ఊరికి రానియ్యకుండ, అవ్వను కడసారిచూపు కూడా చూడనియ్యకుండ చేసింది కులం.అయినా సరే గాయపడ్డ గతం మీదుగా రేపటి భవిష్యత్తును గెలస్తానని, పిడికెలి బిగించి , వంచిన తలెత్తుకుని ' పులి అడుగు దెబ్బ ' కొడుతుంది రాజవ్వ.

ఇట్లా ఈ పుస్తకంలో 19 కథలున్నాయి. పుస్తకానికి తలమానికమైన కండీషన్స్ అప్లయ్ కథ కూడా ఇందులో వైవిధ్యమైంది. కులం ఎక్కడుందనే వారికి పసునూరి కథలు చెంపచెల్లుమనేలా సమాధానం చెబుతాయి. పుట్టిన బిడ్డల్లోనే కాదు, పుట్టబోయే బిడ్డలను కూడా కులంపీడ ఎలా పట్టి పీడిస్తుందో తెలుపుతుంది. అలాంటి కథలే వాట్సప్ స్ట్రీట్స్, పండుగ దు:ఖం వంటివి. అలాగే అంబేద్కర్ స్ఫూర్తితో చదువుకొని ఎదిగిన తరానికి ప్రతీకల్లాంటి కథలు కూడా ఇందులో ఉన్నాయి. ధంకీ, తలదన్నినోడు కథలు చదివినప్పుడు పాఠకులు ఆధునిక దళితుల జీవితాలను తెలుసుకుంటారు. ఈ రకంగా పసునూరి రవీందర్ తన రెండవ కథా సంపుటి ద్వారా అనేక ప్రశ్నలను సమాజం ముందు నిలబెట్టాడు. పాఠకుల్లో ఆలోచనల అలజడిని రేపాడు. ఇవి ఈ కాలాన్ని పట్టించే కథలు. కోట్లాదిమంది దళితుల తీరని వ్యథలు.



-గిద్దకింద మాణిక్యం, 9492164107



# నేనే వెళ్లి కలవాలి

గలగలపారే సెలయేరూ
బిరబిర ఉరికే నదీ
ఎగిసి ఉప్పొంగే కడలీ
కదిలి కలవడానికి నా ఇంటికి రావు

నిటారుగా నిలబడివున్న
గుట్టలూ పర్వతాలూ
నాలుగడుగులేసి నా దగ్గరకు రావు

ముచ్చటగా ఆకుపచ్చగా నవ్వే చెట్లూ
దట్టంగా సమూహంగా ఉండే
అడవులూ
దూరంనుంచే చేతులూపుతాయి
చెంతకొచ్చి చేతులు కలపవు

నీళ్లన్నీ ఇంకి ఇసుక మేటలు
వేయకముందే
రాళ్ళన్నీ కరిగి లోయలుగా
మారకముందే
పచ్చదనం మసిబారకముందే

నేనే వెళ్లి కలవాలి
ప్రకృతితో కరచాలనం చేయాలి

ప్రాణం పోసే ప్రకృతే కాదు
ప్రాణమున్న మంచివాళ్ళూ
ప్రేమలున్న పసివాళ్ళూ
మనసున్న మనుషులూ
లోకాన్ని విడిచి వెళ్లి పోకముందే
నేనే వెళ్లి కలవాలి ఆర్తిగా
కావలించుకుని
కన్నీటితో వాళ్ళ కాళ్ళు కడగాలి



- వారాల ఆనంద్
9440501281

## సుధామ,చంద్రశేఖర అజాద్ లకు మునిపల్లెరాజు శతజయంతి పురస్కారాలు





కథాఋషి, మ్యాజిక్ రియలిజమ్ కథకునిగా పేరొందిన విశిష్టకథకులు, కవి, వ్యాసకర్త, సాహితీవేత్త కీర్తిశేషులు మునిపల్లెరాజు గారి శతజయంతి సందర్భంగా ఈ సారి ఏటా ఇస్తున్న మునిపల్లెరాజు స్మారక సాహిత్య పురస్కారాన్ని 2023 సంవత్సరానికి గాను ప్రముఖ కవి, రచయిత, సాహితీవేత్త ,సప్తపది లఘుకవితా ప్రక్రియ సృజనకర్త శ్రీ సుధామ గారికీ .2024 సంవత్సరానికి గాను సుప్రసిద్ధ కథా,నవలా,సినీ రచయిత శ్రీ పి.చంద్రశేఖర అజాద్ గారికి ప్రదానం చేస్తున్నట్లుగా కణ్వస ట్రస్ట్ మునుపల్లెరాజు కుటుంబ సభ్యుల పక్షాన డా. ఉష మునిపల్లె ఓ పత్రికా ప్రకటనలో తెలియచేస్తున్నారు. ఈ పురస్కార ప్రదాన సభ ఈ మార్చి నెల 17వ తేదీ సోమవారం సాయంకాలం 6 గంటలకు హైదరాబాద్ రవీంద్రభారతి మొదటి అంతస్తులోని సమావేశ మందిరంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,కణ్వస ట్రస్ట్ శ్రీ మట్టిగుంట వెంకటరమణ గారి ఎం.వి.ఆర్.ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతుంది. ప్రముఖ కవి, కథకులు, వ్యాసకర్త, సాహితీవేత్త శ్రీ విహారి గారి అధ్యక్షతన జరిగే సభలో ముఖ్య అతిథిగా నేటినిజం దినపత్రిక సంపాదకులు శ్రీ బైస దేవదాసు గారు పురస్కారప్రదానం చేస్తారు. విశిష్ట అతిథిగా ప్రముఖ రచయిత, వేదిక నిర్వాహకులు శ్రీ అనిల్ అట్లూరి,ఆత్మీయ అతిథులుగా ఆకాశవాణి పూర్వ ఉప సంచాలకులు శ్రీ సి.ఎస్. రాంబాబు, విజయవాడ ఆంగ్లోపన్యాసకులు ప్రముఖ విమర్శకులు శ్రీ బొడ్డపాటి చంద్రశేఖర్ ,మునిపల్లె రాజు గారి కుమారులు శ్రీ అనిల్ కిశోర్ పాల్గొంటారనీ, సాహితీప్రియులంతా అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయగలరని డా. ఉష మునిపల్లె, శ్రీ మట్టిగుంట వెంకట రమణ తెలియచేస్తున్నారు.

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం
కవులు, రచయితల
నుండి కథలు, కవిత్వం,
సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు
మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన
చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp
9247580946

## కథా సంపుటాలకు ఆహ్వానం

వెన్నెల సాహితీ పురస్కారం-2024
కొరకు.. 2023,2024 సం. లలో
ప్రచురించిన కథా సంపుటాలు
నాలుగు (4) ప్రతులను ఈక్రింది
చిరునామాకు, 31మార్చి 2025లోపు
పంపగలరు.సిద్దిపేటలో జరుగు
సాహిత్య కార్యక్రమంలో నగదు
పురస్కారం అందజేయబడును.
చిరునామా, P యాదగిరి,ఇం.
నెం.17-3-86/35, జ్యోతి నిలయం,
వినాయక్ నగర్ రోడ్-2, మయూరి
బార్ & రెస్టారెంట్ ఎదురు వీధి,
రంగధాంపల్లి చౌరస్తా దగ్గర
సిద్ధిపేట, 502103,cell.
9299909516, 9848261284.

పర్కపెల్లి యాదగిరి,
వెన్నెల సాహితీ సంగమం,
ప్రధాన కార్యదర్శి

# తెలుగు కవితకే కీర్తి

## శ్రీశ్రీ మహా ప్రస్థానం

శ్రీశ్రీ మహాప్రస్థానం ఏ తరానికైనా ఏ కాలానికైనా స్ఫూర్తి. "ఎముకలు కుళ్ళిన వయసు మళ్ళిన సోమరులారా చావండి అంటూ యువతలోని ఆవేదనను ఆవేశంగా చెప్పిన శ్రీశ్రీ భావావేశంతో వెలుగులు పంచారు. ఆయన సాహిత్యం చిరంజీవి. నిత్యస్ఫూర్తి. కుదిరితే నడవు.. లేకుంటే పరుగెత్తు ఆయన కలం నింపిన స్ఫూర్తి ఎన్నో వేల జీవితాలకు వెలుగైంది. శ్రీశ్రీ మహా ప్రస్థానంలో .. కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారు. స్ఫూర్తినింపారు. భవిష్యత్తుపై ఆశ కలిగించారు. రగిలించారు. బాధ్యత గుర్తుచేశారు. ధైర్యం నూరిపోశారు. శక్తినింపారు. అందుకే ఎందరో మహానుభావులున్నా.. ఎన్నో అద్భుత రచనలున్నా శ్రీశ్రీ మహాప్రస్థానం ఇప్పటికీ, ఎప్పటికీ ఎవర్ గ్రీన్. తెలుగుకవితకే శ్రీశ్రీ మార్గదర్శి. మహాప్రస్థానం గేయాల్లోని ఇతివృత్తాలు ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న బాధలు, వీటికి నేపథ్యంగా ఉన్న చారిత్రిక పరిణామాలు, పీడితుల పక్షాన నిలవాల్సిన కవికి అవసరమైన లక్షణాలు, నూతనమైన ఈ అంశాలపై రావాల్సిన కవిత్వమూ, తన కవిత్వానికి లక్షణాలు, పీడితులను ఇంకా పీడించేందుకు సహాయకారిగా ఉండే అంశాలు, పరిస్థితులపై తిరుగుబాటు వంటివి ఉన్నాయి. తెలుగు కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన శ్రీశ్రీ "మహాప్రస్థానం"1950లో పుస్తకరూపం ధరించగా, ఏడున్నర దశాబ్దాలైనా ఇప్పటికీ నిత్యనూతనంగా నిద్రలేపుతోంది. మత్తు వదిలిస్తోంది.



### బాటసారి

కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని-
తల్లి మాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి,
మూడురోజులు ఒక్కతీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక -
నడి సముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ,
దిగులు పడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే-
చండ చండం, తీవ్ర తీవ్రం
జ్వరం కాస్తే, భయం వేస్తే,
ప్రలాపిస్తే-మబ్బుపట్టీ, గాలికొట్టీ,
వానవస్తే, వరదవస్తే,
చిమ్మ చీకటి క్రమ్ముకొస్తే
దారి తప్పిన బాటసారికి
ఎంత కష్టం?

### మిథ్యావాది

మాయంటావా?
అంతామిథ్యంటావా?
నా ముద్దుల వేదాంతీ!
ఏం మంటావు?
మాయంటావూ? లోకం
మిథ్యంటావూ?

కనబడినది కనబడదని
వినబడినది వినబడదని
జగతి మరుపు, స్వప్నం,
నిశ్శబ్దం, ఇది
మాయ! మాయ!
మాయంటావూ? అంతా
మిథ్యంటావూ?

### ప్రతిజ్ఞ

నరాల బిగువూ,
కరాల సత్తువ వరాలవర్షం
కురిపించాలని,
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని_
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ
పరిప్లవిస్తూ,
ధనికస్వామికి దాస్యం చేసే,
యంత్రభూతముల
కోరలు తోమే,
కార్మిక వీరుల కన్నుల నిండా
కణకణ మండే, గలగల తొణకే
విలాపాగ్నులకు,
విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేదోయ్!

# అతడే.. కామన్ మ్యాన్

నూతనార్థాల జ్వాలగా
మెరియుచున్నాడు అతడు!
శతాబ్దాల బానిసత్వాన్ని
ఖండించే యోధుడు అతడు!
వేదనను వెలుగులా మార్చే
కళాతపస్వి అతడు!
అన్యాయాల గోడలను
కూల్చే మహాశిల్పి అతడు!.

వేదనను వెలుగులా
మార్చేందుకు కృషి చేస్తూ,
అన్యాయాలను ప్రశ్నిస్తూ,
అణచివేతను ప్రతిఘటిస్తూ,
శ్రామిక వర్గాలను
ప్రోత్సహిస్తూ,
వ్యవస్థను మార్చేందుకు
సంఘటితం చేస్తున్న
కర్మయోగి అతడే!

భూమిని దున్నే చేతులను
అణచివేతను తుదముట్టించే
అస్త్రాలుగా సంధిస్తూ,
చరిత్రను సరికొత్తగా
లిఖిస్తూ,
కన్నీటి సముద్రంలో
చిరునవ్వులు
పూయించే బాధ్యతను,
భుజస్కంధాలపై
మోస్తున్నది అతడే
అతడే కామన్ మ్యాన్!

- రాము కోలా,
దెందుకూరు, ఖమ్మం.
9849001201.

# ఇందిరమ్మ రాజ్యంతో పేదల సొంతింటికల సాకారం

■ గత తొమ్మిదేళ్లుగా సొంత ఇల్లు కల...కలగానే మిగిలింది
■ పోమాల్ పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ
■ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** పేద ప్రజల సొంతింటి కలను తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం నిజం చేస్తుందని, ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటికల సాకారం అవుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పోమాల్ పల్లి గ్రామంలో ఎస్సీ, బీసీ వార్డుల్లో ఎనిమిది ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ముఖాల్లో చిరునవ్వులు చూడటమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందించి తీరుతామన్నారు. పేదోని సొంతింటి కల, గత ప్రభుత్వంలో కలగానే మిగిలిందని, ఇందిరమ్మ రాజ్యంతో అది సాధ్యమని కాంగ్రెస్ మరోసారి నిరూపించిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, ఎంపీఓ కిష్టప్ప, పిఆర్ ఏఈ నర్సింగ్ రావు, హౌసింగ్ ఏఈ కరుణాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధనుంజయ్, మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గూడ వీరేశం, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు కర్ణాకర్, భాస్కర్ గౌడ్, నాయకులు జగదీశ్వర్, కృష్ణయ్య, శ్రీధర్ రెడ్డి, బీసా కరుణాకర్ రెడ్డి, సురేష్ రెడ్డి, తైద పర్వతాలు, బండెల రాజేందర్ రెడ్డి, రావుల పెంటయ్య, తుమ్మల గోపాల్, శ్రీనాథ్, మంజుల రాజశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

# లొంగిపోయిన మావోలకు సాయం అందిస్తాం

■ ఏఎస్పీ శివం ఉపాధ్యాయ
■ ఇద్దరు లొంగిపోయిన మిలీషియా సభ్యులకు రివార్డు అందజేత



**ములుగు, మహా :** లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాసం కల్పించేందుకు సిద్ధంగా ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబ సభ్యులతో సుఖంగా జీవించాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ పిలుపునిచ్చారు. ఆదివారం ఏటూరునాగారంలో లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు అందజేసి అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మిలీషియా సభ్యుడు ఛత్తీస్గఢ్ రాష్ట్రం ఉసూర్ పీఎస పరిధిలోని పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడవి కొస, మిలీషియా సభ్యురాలైన మడకం సోడి అలియాస్ జోగిలు మావోయిస్టుల సిద్ధాంతాలు నచ్చక జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకొని ఏటూరునాగారంలో లొంగిపోయారు. గత నాలుగేళ్ల క్రితం మడవి కొస మావోయిస్టు పార్టీలో చేరి అగ్రనేతలకు సేవలందించాడు. అదేవిధంగా మడకం సోడి సైతం రెండేళ్లుగా మావోయిస్టు సభ్యురాలిగా పని చేస్తూ లైంగిక వేధింపులు, అఘాయిత్యాలు భరించలేక పార్టీని వీడారు. కాగా, అమాయక ప్రజలను తమ స్వార్థానికి మావోయిస్టు పార్టీలోకి బలవంతంగా తీసుకువెళ్లి బలిచేస్తున్నారని, కాలం చెల్లిన సిద్ధాంతాలను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సూచించారు. లొంగిపోయిన మావోయిస్టులకు సరెండర్ కం రిహాబిటేషన్ విధానం ద్వారా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాస్, వెంకటాపురం సీఐ బండారి కుమార్, ఎస్ఐ కె.తిరుపతి రావు, రెండవ ఎస్సై డి.నరసింహ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

# మెరుగైన ర్యాంకు కై కృషి చేయాలి



**వరంగల్ మహా :** స్వచ్ఛ సర్వేక్షన్ 2024 లో మెరుగైన ర్యాంకు సాధనకు కృషి చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం నగరం లోని బల్దియా ప్రధాన కార్యాలయం లో గల షీ టాయిలెట్ తో పాటు హన్మకొండ లోని డి ఈ ఓ కార్యాలయం వద్ద గల పబ్లిక్ టాయిలెట్ అదాలత్ వద్ద గల పబ్లిక్ టాయిలెట్ లను క్షేత్ర స్థాయి లో పరిశీలించి నిర్వహణ తీరును ఏం హెచ్ ఓ ను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్2024 లో నగరానికి మరో మారు ఓ డి ఎఫ్ + + సర్టిఫికెట్ సాధించేలా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ ఉండాలని నగర వ్యాప్తం గా ఉన్న పబ్లిక్ టాయిలెట్ లలో ఏమైనా మరమత్తులు అవసరం ఐతే వెంటనే చేపట్టి వినియోగం లోకి తేవాలని అదాలత్ వద్ద గల ప్రజా మరుగుదొడ్డి నీరు లేక పనిచేయడం లేదని తెలుపగా బోర్ వేయించి నీటి సరఫరా కల్పించి పని చేసేలా చూడాలని గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అనే నామ ఫలకం (నేమ్ ప్లేట్)తో పాటు స్వచ్ఛ సర్వేక్షన్ సంబంధిత అంశాలు స్పష్టం గా కనిపించేలా పెయింట్ వేయించి రాయించాలని తెలిపారు. పబ్లిక్ టాయిలెట్ల పైన ఉన్న అడ్వేర్టైజ్మెంట్ బోర్డ్ లపై ప్రాపర్టీ టాక్స్, ఎల్ ఆర్ ఎస్, స్వచ్ఛ సర్వేక్షన్ ను సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# టీయూడబ్ల్యూజే ను విమర్శిస్తే ఖబడ్దార్




**కరీంనగర్, మహా:** నిరంతరం జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న టియుడబ్ల్యూజె ను విమర్శిస్తే సహించేది లేదని టియుడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ అన్నారు. టి యు డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు గాండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం టీయూడబ్ల్యూజే కరీంనగర్ జిల్లా శాఖ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం స్థానిక ఎస్ ఆర్ ఆర్ బ్యాంకెట్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి రామనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ 70 సంవత్సరాల్లో అనేక విజయాలు సాధించిన ఘనత టీయూడబ్ల్యూజే దేనని అన్నారు. అనేక అసంఘటిత శక్తులు యూనియన్ విచ్ఛిన్నం చేయాలని చూసిన కొట్లాడి గెలిచిన సంఘం మనది అన్నారు. సాక్షాత్తు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి అత్యధిక జర్నలిస్టుల సభ్యత్వం కలిగిన సంఘంపై ఉసిగొలిపిన కొట్లాడి నిలబడిన చరిత్ర టీయూడబ్ల్యూజేకు దక్కిందన్నారు. ఈరోజు ప్రతి జర్నలిస్టు పొందుతున్న సంక్షేమం టియుడబ్ల్యూజే కృషి ఫలితమేనని అన్నారు. అనేక ప్రత్యర్థి యూనియన్లు అసత్య ఆరోపణలతో జర్నలిస్టులను తప్పిదారి పట్టిస్తూ కోర్టులను సంప్రదించిన టి యు డబ్ల్యూ జె యూనియన్ నిబద్ధతను చూసి ప్రత్యర్థి సంఘాలకు కోర్టు లు మొట్టికాయలు వేసిన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. నాటికి నేటికీ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న యూనియన్ ఏదన్నా ఉందంటే అది టీ యు డబ్ల్యూ జెనన్నారు. కరీంనగర్ పట్టణ జర్నలిస్టుల నివేషణ స్థలాల సమస్య జటిలం అయ్యేందుకు గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. జర్నలిస్టులకు సరైన ప్రొసిడింగ్ ఇవ్వకుండా జర్నలిస్టుల మధ్య అవరోధం సృష్టించారన్నారు. అయినా జర్నలిస్టులు ఐక్యంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. నివేషణ స్థలాల సమస్యలు పరిష్కరించడానికి రాష్ట్ర కమిటీ అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందుతుందన్నారు. దేశంలో ఎక్కడలేని విధంగా మండల స్థాయి రిపోర్టర్లకు సైతం అక్రిడిటేషన్లను అందించిన ఘనత టి యు డబ్ల్యూ జే కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొయ్యడ చంద్రశేఖర్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నగునూరి శేఖర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్,.. కరీంనగర్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఊరేడి రవీందర్ ఐజేయూ సభ్యుడు జానంపేట మారుతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఇమామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యులు బల్మూరు విజయ్ రావు, మహేంద్ర చారి, కోశాధికారి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల సంపత్, శైలేందర్ రెడ్డి ఎండి సుకుర్, భరణి కుమార్ సంయుక్త కార్యదర్శులు సిర్ర తిరుపతి కొండల్ రెడ్డి పొలు సంపత్ దాడి సంపత్ లతోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా నాయకులు మండల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి ఉత్సవాలు



**వరంగల్, మహా ;** భారత మాజీ ప్రధాని భారతరత్న అటల్ బిహారీ వాజ్ పేయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆదివారం డి కన్వెన్షన్ వరంగల్ లో అటల్ జి యాది లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి మాజీ పార్లమెంటు సభ్యులు, ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ సభాధ్యక్షతన ముఖ్యఅతిథులుగా మాజీ గవర్నర్ సి.హెచ్ విద్యాసాగర్ రావు విచ్చేసిన సందర్భంగా వారికి బిజెపి వరంగల్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, కొలను సతీష్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జర్నలిస్ట్ గా వాజపేయ్ ప్రస్థానం ప్రారంభమైందని శ్యాం ప్రసాద్ ముఖర్జీ తో ఉన్న అనుబంధం ప్రకర దేశభక్తునిగా మార్చింది, దీన్ దయాల్ ఉపాధ్యాయ బోధనలు విని, భరతమాత రోదనలు చుసి, భారతీయుల ఆవేదన చుసి అజన్మాంతం బ్రహ్మచారీ గా ఉండాలని నిర్ణయించుకున్నాడని, భారత రాజకీయాలలో భావజాలాలకు అతీతంగా అందరి గౌరవాన్ని పొందిన ఏకైక రాజకీయ నాయకుడు అసలు సిసలైన నిజమైన భారతరత్న వాజపేయ్ గారని వారి గురించి గంట రవికుమార్ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, మాజీ మేయర్ టి. రాజేశ్వర రావు, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, మాజీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నాగపురి రాజమౌళి గౌడ్, మంద ఐలయ్య, కన్నబోయిన రాజయ్య యాదవ్, దేవేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నిశిధర్ రెడ్డి, బలరాం, సోడా రమేష్, ప్రోగ్రాం కన్వీనర్లు, అలాగే అటల్ జి తో అనుబంధం ఉన్నవారు పాల్గొన్నారు.

# జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయడం సరైన నిర్ణయం




**హనుమకొండ, మహా ;** అసెంబ్లీలో స్పీకర్ పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పై సస్పెండ్ చేయడం సరైన నిర్ణయం అని,దళిత ప్రజా ప్రతినిధుల పట్ల చులకన భావంతో మాట్లాడిన జగదీశ్ రెడ్డి వాక్యాలను సమర్థిస్తున్న కేటిఆర్, హరీష్ రావు లు దళితులను చిన్నచూపు చూస్తున్నారని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ మండిపడ్డారు. ఆదివారం టీపీసీసీ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ఎమ్మెల్యే నాయిని , కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డి పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి అశోక జంక్షన్ వరకు ర్యాలీగా వచ్చి కేటిఆర్,జగదీశ్ రెడ్డి దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ బి ఆర్ ఎస్ పార్టీ కనీస ప్రతిపక్ష పాత్ర పోషించడం కూడా రావడం లేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన బీసీ కులగణన సర్వేలో కేసీఆర్, కేటిఆర్, హరీష్ రావు పాల్గొనలేదని విమర్శించారు. రాజ్యాంగ బద్ధమైన పాలన అందిస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు.ప్రజా ప్రభుత్వ పాలనకు సలహాలు ఇవ్వాల్సింది పోయి సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి చెందిన సింగారం మధు మున్సిపల్ కార్యాలయంలో వాటర్ మెన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం నుంచి ఇంటికి రాక పోవడంతో అతని తల్లిదండ్రులు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద మృతుడి పర్సు, చెప్పులను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు, డిఆర్ఎఫ్ బృందాల సాయంతో సుమారు 4 గంటలపాటు గాలింపు చర్యలు చేపట్టి, చెరువులో నుంచి మృతదేహం వెలికితీశారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# అట్టహాసంగా కంది శ్రీనివాస రెడ్డి తనయుడి కేశఖండన మహోత్సవం



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మౌనా శ్రీనివాస రెడ్డి దంపతుల ముద్దుల తనయుడు కంది ఇషాన్ రెడ్డి కేశఖండన మహోత్సవం సందర్భంగా మావల మండల పరిధిలోని పద్మనాయక గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి అశేషంగా జనం తరలివచ్చారు. కంది శ్రీనివాసరెడ్డి ఆహ్వానం మేరకు పలువురు రాజకీయ ప్రముఖులు, పట్టణ ప్రముఖులు ,అధికారులు ,బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు, నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో వేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి కుమారుడు ఇషాన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించారు. కంది శ్రీనివాసరెడ్డి దంపతులను కలిసి కేశ ఖండన మహోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.









# కరీంనగర్ లో కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ పర్యటన



**కరీంనగర్, మహా:** కరీంనగర్ నగరపాలక సంస్థ ఆస్తి పన్నుల వసూళ్ళలో కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ రంగంలోకి దిగారు. నగరంలోని పలు డివిజన్ లలో పర్యటిస్తూ.... రెవెన్యూ విభాగం అధికారులు సిబ్బందితో కలిసి ఆదివారం రోజు మొండి బకాయి దారుల నివాస గృహాలను సందర్శించారు. గత కొద్ది సంవత్సరాలుగా నగర పాలక సంస్థ కు ఆస్తి పన్నులు చెల్లించని బకాయి దారుల నుండి పన్నులు కట్టించారు. ఇప్పటికే పలు మార్లు నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన లేకుండా పన్నులు చెల్లించని మొండి బకాయి దారుల షాపులకు తాళం వేయించారు. సకాలంలో నగరపాలక సంస్థ ఆస్తి పన్నులు చెల్లించని బకాయి దారుల పై మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్వయంగా పలు డివిజన్ లలో బకాయి దారుల కు రెడ్ నోటీసులు జారీ చేసి పన్నులు చెల్లించాలని తెలిపారు. నగరంలోని రాంనగర్ లిటిల్ పార్కు తో పాటు మార్కెట్ రోడ్డులోని పలు లాడ్జ్ లు, కమర్షియల్ షాపులను సందర్శించి.... మొండి బకాయి దారులను పన్నులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెడ్ నోటీసులు జారీ చేసి నోటీసు గడువు ముగిస్తున్నె లిటిల్ పార్కుకు పన్నులు చెల్లించక పోతే... తాళం వేయాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ రోడ్డు లోని లక్ పతి కాంప్లెక్స్ కమర్షియల్ షాపులకు తాళం వేయించారు. ఈ సందర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.... 20242025 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుల చెల్లింపుల గడువు ముగుస్తున్నందున మొండి బకాయి దారుల పై మున్సిపల్ చట్ట ప్రకారం తగిన చర్యలు తీస్కోవాని ఆదేశించారు. ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేసిన స్పందించకుండా పన్నులు చెల్లించని వారి పై చర్యలు తీస్కోవాలన్నారు. షాపులకు తాళాలు వేయడంతొ పాటు నివాస గృహాలకు నగరపాలక సంస్థ ద్వారా ఇచ్చే అత్యవసర సేవలను తొలగించడంతొ పాటు నల్లా కనెక్షన్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పన్నులు చెల్లించని వారిపై నగరపాలక సంస్థ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ, ఇంచార్జ్ ఆర్వో కలీమల్లా ఖాన్, ఆర్ లు, డిజాస్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

# 25వ డివిజన్ లో ఉచిత వైద్య శిబిరం



**వరంగల్, మహా ;** 25వ డివిజన్ పరిధిలోని మండి బజార్, మట్వాడ,లో సెంటినరీ ట్రినిటి బాప్టిస్టు చర్చ్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ ఉచిత వైద్య శిబిరం ప్రారంభికులు స్థానిక సంఘ కాపరి రెవ" డా"బి.వినయ్ కుమార్ మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ప్రెసిడెంట్ పి.ఆర్. విజయ్ కుమార్, సెక్రెటరీ జె.జె.విల్సన్, ట్రెజరర్ జే.ఎన్. శ్రీనివాస్,జాయింట్ సెక్రెటరీ జె.పీ.కర్ణాకర్,ఇ.సీ.మెంబర్ జన్ను.చిట్టి బాబు,జన్ను.శ్యామ్,జన్ను రవి,జన్ను జోసెఫ్, స్థానిక సంఘ కమిటీ సభ్యులు ,గ్రావీడ్ హోమ్స్ హాస్పిటల్ నుండి డా"రమ్య వందనశెట్టి, ఏఓ రామ్ రెడ్డి,మేనేజర్ రంజిత్,అనిల్ రాజేష్, హాస్పిటల్ బృందం వారు పాల్గొని స్థానిక ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఫిట్స్, మెడ నొప్పి ,తలనొప్పి డిస్క్ సమస్యలు ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచిత మందులు పంపిణి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రమ్య వందనశెట్టి మాట్లాడుతూ ఉచిత ఓపి సర్వీస్ తోపాటు ఐపీ సర్వీస్ ఆరోగ్యశ్రీ లో సేవలు ప్రారంభించారు. ఇట్టి ఉచిత ఆరోగ్యశ్రీ సేవలు మండి బజార్ కాల నీవాసులు వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు, స్థానిక కమిటీ సభ్యులు, తదితరులు, పాల్గొన్నారు .

# పోచమ్మ ఆలయంలో కంది కుటుంబం పూజలు



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి మౌనా శ్రీనివాస రెడ్డి దంపతుల ముద్దుల తనయుడు కంది ఇషాన్ రెడ్డి కేశఖండన మహోత్సవం సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి డప్పుచప్పుళ్ల మధ్య స్వగ్రామం హస్నాపూర్ లోని పోచమ్మ ఆలయాన్ని సందర్శించారు.పోచమ్మతల్లికి మొక్కులు సమర్పించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల నడుమ ఈ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కేశఖండన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం వేకువజాము నుంచే సంప్రదాయ పూజాది కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి.పూజల అనంతరం కటుంబపెద్దల ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతకుముందు గ్రామంలోని సవారీ బంగ్లాను సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.



# సమానత్వమే మహిళలకు మనమిచ్చే గౌరవం

- ఉప్పల్ లోని ఎస్ వీఎం గ్రాండ్ లో నిరుద్యోగ మహిళల కోసం మేఘా జాబ్ మేళా
- స్వశక్తితో బ్రతకడం ద్వారా మహిళల ఆత్మగౌరవం మరింతగా పెరుగుతుంది: డీజీపి జితేందర్ ఐపీఎస్
- వివక్ష లేని సమాజం మహిళల హక్కు. సమానత్వమే మనం వారికిచ్చే గౌరవం: సీపీ సుధీర్ బాబు ఐపీఎస్




**ఉప్పల్,మహా :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిరుద్యోగ మహిళలు, విద్యార్థినిల కోసం, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ ల సంయుక్త ఆధ్వర్యంలో మేఘా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ రెడ్డి ఐపీఎస్, రాచకొండ సీపీ సుధీర్ బాబు ఐపీఎస్ పాల్గొన్నారు.జాబ్ లో సెలెక్ట్ అయిన నిరుద్యోగ మహిళలకు సర్టిఫికెట్ అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర డిజిపి శ్రీ జితేందర్ ఐపీఎస్ మాట్లాడుతూ, సమాజంలో సగభాగం ఉన్న మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి విధి అని తెలిపారు. మహిళలు గృహిణిగా, తల్లిగా, ఉపాధ్యాయురాలిగా, స్నేహితురాలిగా, కూతురిలా ఇలా విభిన్న పాత్రలు పోషిస్తూ పురుషుడి విజయంలోనూ, అతని సుఖసంతోషాలలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తారని, అటువంటి స్త్రీలను గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అయితే స్త్రీలు కేవలం ఇంటికి పరిమితం కాకుండా ఉన్నత చదువులు చదివి, వారిలో ఉన్న విభిన్న నైపుణ్యాలను, మేధస్సును ఉపయోగించుకొని వారి అర్హతలకు తగిన విధంగా ఉన్నత ఉద్యోగ అవకాశాలు దక్కించుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్త్రీలు ఆత్మగౌరవంతో బతకడం ద్వారా వారి విలువ మరింతగా పెరుగుతుందని, స్వశక్తితో బతకడం అనేది అందుకు మరింతగా దోహదం చేస్తుందని పేర్కొన్నారు. స్త్రీలు తమకున్న నైపుణ్యాలను కోల్పోకూడదని, వారికున్న మేధస్సును సమాజానికి ఉపయోగపడేలా చేయాలని అందుకోసం ఉత్సాహంగా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను దక్కించుకొని సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ మాట్లాడుతూ, స్త్రీని గౌరవించే చోట దేవతలు కొలువై ఉంటారని, స్త్రీని గౌరవించడం అంటే మనల్ని మనం గౌరవించుకోవడమేనని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా దాదాపు 2800 మంది ఉత్సాహవంతులైన మహిళలు ఉద్యోగ అవకాశాల కోసం నమోదు చేసుకోగా వారిలో విభిన్న అర్హతలు, నైపుణ్యాలు కలిగిన దాదాపు 2323 మంది ఉద్యోగాలు పొందినట్లు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు పొందిన మహిళలు తమ వృత్తి జీవితంలో మరింతగా ఎదిగేందుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును కూడా భవిష్యత్తులో అందిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ లోని సభ్య కంపెనీలు గొప్ప మనసుతో ముందుకు వచ్చి ఎంతోమంది ఆశావహులైన మహిళలకు ఉద్యోగాలు కల్పించడం అనేది ఎంతో గొప్ప విషయమని ప్రత్యేకంగా అభినందించారు. మహిళలను పురుషులతో సమానంగా చూడడమే మనం వారికి ఇచ్చే గౌరవమని, ప్రతి రంగంలోనూ పురుషులతో సమానంగా పోటీ పడుతున్న మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. మల్కాజ్గిరి డీసీపీ పివి పద్మజ ఐపిఎస్, డీసీపీ యాదాద్రి అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి అడ్మిన్ ఇందిర, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాసులు, డిసిపి ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, డిసిపి రోడ్ సేఫ్టీ మనోహర్, డీసీపీ స్పెషల్ బ్రాంచ్ జి.నరసింహారెడ్డి, డిసిపి ఎస్ఓటి రమణారెడ్డి, డిసిపి శ్యామ్ సుందర్, డీసీపీ సైబర్ క్రైమ్స్ నాగలక్ష్మి మరియు ఫోరమ్ వైజ్ జాయింట్ సెక్రటరీలు: సేఫ్టీ & సెక్యూరిటి ఫోరమ్:, శ్రీ వాసుదేవ్ రావు గ్రూప్ డైరెక్టర్ CDC SNIST, ఉమెన్స్ ఫోరం: డాక్టర్ రాధికానాథ్, శ్రీ సాయి సెక్యూరిటీ డైరెక్టర్, సైబర్ సెక్యూరిటీ ఫోరమ్, ట్రాఫిక్ ఫోరమ్: శ్రీనివాస్, శ్రీనివాస టూర్స్ & ట్రావెల్స్ వ్యవస్థాపక డైరెక్టర్, వంశీ ప్రోగ్రామ్ మేనేజర్ ఇన్ఫోసిస్, ఆర్.కె.ఎస్.సి చీఫ్ కోఆర్డినేటర్ సావిత్రి పాల్గొన్నారు.

# స్పీకర్ ను అవమానించడం బాధాకరం



**ములుగు, మహా :** దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్ ను బీఆర్ఎస్ నేతలు పదేపదే అవమానిస్తున్నారని, అధికారంపోయినా అహం తగ్గలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ విమర్శించారు. అసెంబ్లీలో స్పీకర్ ను అవమానించిన ఎమ్మెల్ఏ జగదీశ్వర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ములుగులో జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. దళితులను అవమానించడమే బీఆర్ఎస్ పనిగా ఉందని విమర్శించారు. అట్టడుగు వర్గాల ప్రజలు ఇప్పుడిప్పుడే అధికారంలో భాగస్వామ్యం అవుతున్నారని, ఓర్వలేక అవమానకరంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. నువ్వు స్పీకర్..స్పీకర్ లా కూర్చోవడమే నీ పని.. వేరే అధికారాలు లేవు అంటూ ఏకవాక్యంతో ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి స్పీకర్ ను సంభోదించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. స్పీకర్ కు విశేషమైన అధికారాలు ఉన్నాయని గుర్తు చేశారు. కొన్ని వర్గాలకు, కొన్ని కుటుంబాలకు మాత్రమే గౌరవం ఉంటుంది అన్నట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. పదేళ్లలో చేయలేని అభివృద్ధి పది నెలల్లో చేసి చూపిస్తే బీఆర్ఎస్ నేతల కండ్లు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మండల అధ్యక్షుడు ఎండీ. చాంద్ పాషా, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్, వంగ రవి యాదవ్, నూనేటి శ్యాం, బండి శ్రీనివాస్, మావురపు తిరుపతి రెడ్డి, ముదుతనపల్లి మోహన్, బ్లాక్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈగా దయాకర్ గుప్తా కు వాసవి వైభవ పుత్ర అవార్డు



**సూర్యాపేట, మహా :** ఆదివారం సికింద్రాబాద్ లోని హరి హర కళా మందిర్ లో సూర్యాపేట పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక, సామజిక సేవా కర్త ఈగా దయాకర్ గుప్తా వాసవి వైభవ పుత్ర అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సర్ సి వి రామన్ అకాడమీ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం వారి ఆధ్వర్యంలో పలు రంగాలలో సేవలు అందించిన 2 తెలుగు రాష్ట్రాల లోని సుమారు 150 మందికి బ్రహ్మ శ్రీ డా. శ్రీ కృష్ణ చాముండేశ్వర మహర్షి , సినీ నటులు కోట శంకర్ రావు ల చే అవార్డ్స్ అందుకున్నట్లు తెలిపారు. ఈగ దయాకర్ గుప్తా శ్రీ వాసవి మాత సేవా సమితి ద్వారా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం తోపాటు సదాచార్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది నిరుపేద వధువులకు దాతల సహాయం తో పుస్తె మట్టెలు అందించారు. అవార్డు తో పాటు ఉగాది మహోత్సవ స్వర్ణ కంకణం, మెమెంటో, నంది విగ్రహం, గోల్డ్ మెడల్ శాలువా తో సత్కరించారు.ఇట్టి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఈ అవార్డు విశ్వమాత వాసవి మాత పేరుతో అందుకోవడం ఎంతో సంతోషం గా ఉందని, అవార్డు వల్ల సమాజానికి ఇంకా సేవ చేసే భాధ్యత పెరిగిందని తెలుపుతూ సర్ సి వి రామన్ అకాడమీ నిర్వాహకులు ఎం వెంకటేశ్వర్ రావు కు ధన్యవాదములు తెలిపారు.

# జమిలి ఎన్నికల తో ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు




**కరీంనగర్, మహా :** వన్ నేషన్ , వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికల) తో ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు వస్తాయని , లోక్ సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే భారీగా ప్రభుత్వ ధన వృధా ఖర్చులు తగ్గుతాయని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. వన్ నేషన్ , వన్ ఎలక్షన్ వర్క్ షాప్ కార్యక్రమం ఆదివారం రోజున కరీంనగర్ బిజెపి జిల్లా కార్యాలయంలో ప్రోగ్రాం కన్వీనర్, జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం అధ్యక్షతన జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే సమయం ఆదాతో పాటు రెండుసార్లు ఎన్నికలు జరగకుండా వారంతా పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలకు తరుచూ ఎన్నికల కోడ్ అడ్డంగా మారడం కూడా తగ్గుతుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్ల పోలింగ్ శాతం కూడా గణనీయంగా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా స్వాతంత్రం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్ సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవని, ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు కావడం, 1970 లో ఏడాది ముందే లోక్ సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయింది అన్నారు. 1983లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలి ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చిందని , 1999లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తిన అది ఆచరణలోకి రాలేదన్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్ సభ ఎన్నికల కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా ఖర్చులు చేస్తుందని , వేర్వేరు సమయాల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల జరుగుతున్న భారీ ఖర్చులను అరికట్టడానికి, ప్రజా ధనాన్ని వృధా కాకుండా, ఎన్నికల నిర్వహణలో సమూల మార్పులు చేపట్టడానికి జమిలి ఎన్నికలను తీసుకురావాల్సిన అవసరం ఉందని మోదీ ప్రభుత్వం భావించిందన్నారు. ఆదిశగానే 2016 లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జమిలి ఎన్నికల ఆలోచనలను ప్రతిపాదించగా, దీనిపై 2017లో నీతి ఆయోగ్ కసరత్తు చేసిందన్నారు. 2022 డిసెంబర్లో జెమిని ఎన్నికలపై లా కమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు ,విద్యావేత్తలు, నిపుణుల, అభిప్రాయాలను ఆహ్వానించిందన్నారు. ఆ తదనంతరం కేంద్ర ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని కూడా ఏర్పాటు చేసిందన్నారు. ఈ ప్రతిపాదనపై రాజకీయ పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని, కొన్ని పార్టీలు జమిలి, ఎన్నికలపై మద్దతు తెలుపుతుంటే, మరికొన్ని వ్యతిరేకిస్తు, పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నాయన్నారు. జమిలి ఎన్నికలపై ప్రజల్లో చర్చ జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్ నేషన్, వన్ ఎలక్షన్ ప్రోగ్రాం కన్వీనర్ సాయిని మల్లేశం ,కో కన్వీనర్ మాడ వెంకటరెడ్డి , శంకర్, సునీల్ రావు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలి



**పెద్దపల్లి, మహా :** పెద్దపల్లి జిల్లాలో ఫోటో, వీడియో గ్రాఫర్లకు సబ్సిడీ రుణాలు అందించాలని పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ఎన్టిపిసి లోని జ్యోతి భవన్ లో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ కు పెద్దపల్లి జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పోగుల విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్ లు మాట్లాడుతూ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఫోటో వీడియోగ్రాఫర్లు ఎప్పటికప్పుడు నూతనంగా కెమెరాలను కొనుగోలు చేయాల్సి వస్తుందని అన్నారు. కెమెరాల కొనుగోలుకు, స్టూడియోల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు అందించేలా కృషి చేయాలని కోరారు. బ్యాంకర్లు షూరిటీల పేరు తో జాప్యం చేస్తున్నారని తెలుపగా,బ్యాంకర్ల తో సమావేశం ఏర్పాటు తొందరగా రుణాలు ఇచ్చేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ కోశాధికారి అల్లం సతీష్,నాయకులు బత్తుల రాజు,సౌత్ కారి చంద్రకాంత్,కొత్తూరి సదయ్య,అంగజాల మల్లయ్య,తుమ్మ కళ్యాణ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# యువత కష్టపడి ఉన్నత లక్ష్యాలను సాధించాలి



**మోత్కూర్ మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మున్సిపల్ కేంద్రంలోనీ ప్రముఖ వ్యాపారవేత్త ఎగమాటి రాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, పైళ్ల సోమిరెడ్డి, యువత కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రముఖ వ్యాపారవేత్త ఎగమాటి రాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు, పైళ్ల సోమిరెడ్డి అన్నారు. గ్రూప్ 2 ఫలితాల్లో స్టేట్ 11వ ర్యాంక్ సాధించిన మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన గుర్రం సాయి కృష్ణారెడ్డి, అతని తల్లిదండ్రులు మోహన్ రెడ్డి, స్వరాజ్యంలను ఆదివారం స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో వారు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాధారణ కుటుంబానికి చెందిన సాయి కృష్ణారెడ్డి తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా కష్టపడి చదువుకొని గ్రూప్ 2లో స్టేట్ 11వ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. సాయి కృష్ణారెడ్డి ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రులకు, పుట్టిన వరకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముప్ప వెంకట్ రెడ్డి, ముప్ప తిరుమల్ రెడ్డి, గనగాని నర్సింహ, మొగుల్లపల్లి సోమయ్య, మెట్టు మంగేష్, కొప్పుల కరుణాకర్ రెడ్డి, బద్దం రామనర్సింహారెడ్డి, గౌరు సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, గడ్డమీది రమేష్, సోమ వెంకన్న, బిళ్లకంటి సోమిరెడ్డి, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 37టన్నుల పీడిఎస్ రైస్ సీజ్



**ఎల్బీనగర్,మహా:** పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్న ఇద్దరిని హయత్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి వారి నుండి 30టన్నుల రేషన్ బియ్యంతో ఉన్న లారీతో పాటు ఓ గోదాంలో ఉన్న 7టన్నుల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హయత్ నగర్ ఇన్స్ పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం హయత్ నగర్ అంబేద్కర్ నగర్ లో నివాసం ఉంటున్న కాట్రోతు తిరుపతి(37) హయత్ నగర్ లోని పీడిఎస్ రైస్ ను సేకరించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నాడు.రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం పెద్దఅంబర్ పేట్ నుండి మునుగనూర్ వెళ్లే దారిలో ఓ పాత గోదాంలో లారీలోకి పీడిఎస్ రైస్ నింపుతున్నట్లు హయత్ నగర్ పోలీసులకు పక్క సమాచారం వచ్చింది దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు 30టన్నుల పీడిఎస్ బియ్యంతో ఉన్న లారీని సీజ్ చేశారు.గోదాంలో ఉన్న 7టన్నుల పీడీసీ బియ్యాన్ని సీజ్ చేశారు.తిరుపతిలో పాటు లారీ డ్రైవర్ శివకుమార్ ను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.హయత్ నగర్ శివారులో ఇలాంటి పాత గోదాంలలో ఈ బ్లాక్ మార్కెట్ దందాలు చాలానే కొనసాగుతున్నట్లు సమాచారం.

# మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**కరీంనగర్, మహా :** మాధవ సేవ సమితి కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున స్థానిక కిసాన్ నగర్ బస్తీ లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇట్టి శిబిరంలో కరీంనగర్ ప్రముఖ ఈ ఎన్ టి స్పెషలిస్టు వైద్యులు, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి డాక్టర్ రవి కాంత్ , డాక్టర్ జయప్రకాష్ , డాక్టర్ ప్రమోద్ , చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ విజయ్ , డాక్టర్ సందీప్ , డెర్మటాలజీ డాక్టర్ వికాస్ లాహోటి , ఆర్ఎంఓ డాక్టర్ నవీన్ , జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శేష శైలజ , డాక్టర్ గంగాధర్ , డాక్టర్ సందీప్ , మేడికో చక్రవర్తుల సుబ్రహ్మణ్యం లు పాల్గొని వారి వైద్య బృందంతో శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో ప్రధానంగా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు . అలాగే రక్త పరీక్షలు నిర్వహించి మధుమేహ మోతాదులను తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఉద్దేశించి డాక్టర్ చక్రవర్తుల రమణాచారి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఎండ తీవ్రతలు విపరీతంగా పెరిగే అవకాశం ఉన్నందున వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు అశ్రద్ధ నిర్లక్ష్యం చేయవద్దని, వైద్యుల సలహాలు, సూచనల ప్రకారం నడుచుకుంటూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కూర తిరుపతి తోపాటు , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ సహ వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళి, మాధవ సేవ సమితి కరీంనగర్ సంయుక్త కార్యదర్శి కామారపు ప్రసాద్, సభ్యులు నగనూరి చంద్రశేఖర్ , బోయిని పురుషోత్తం , రాష్ట్రీయ స్వయంసేవక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్రిశక్తి మహిళా సేవలు పేదలకు కొండంత అండ



**సూర్యాపేట, మహా :** సూర్యాపేట త్రిశక్తి వనిత గ్రూప్ ఆధ్వర్యంలో అన్ని రంగాల్లో పనిచేసిన వారిని గుర్తించి మరొక ప్రక్క ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించడానికి కావలసిన పరికరాలను దాతల సహకారంతో ఉచితంగా అందిస్తూ ముందుకు సాగుతున్నదని త్రిశక్తి వనిత గ్రూప్ అధ్యక్షురాలు పసుపర్తి జ్యోతి కృష్ణ మూర్తులు అన్నారు. జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగా అంగరంగ వైభవంగా మహిళా దినోత్సవ వేడుకలు సూర్యాపేట కేంద్రంలో నిర్వహించారు. అభివృద్ధి పథంలో ఉన్న మహిళలకు ఘనంగా సన్మానాలు, వ్యవసాయ మహిళా రైతులకు,, పారిశుద్ధ కార్మికులకు, టీచర్స్ కు, కర్నల్ సంతోష్ బాబు తల్లిగారైన బిక్కుమల్ల మంజుల ఎస్ ఎస్ సి క్యాటరింగ్ వారికి ఇలా విభిన్నమైన రంగాలలో అభివృద్ధి చెందిన మహిళలకు కోలాటాలతో వారిని స్టేజి మీదికి తీసుకెళ్లి ఘనంగా సన్మానించడం జరిగింది . చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా విజయవాడ, కోదాడ, మట్టపల్లి, నల్గొండ, తుంగతుర్తి, మద్దిరాల, నుండి కూడా మహిళలు అధిక పాల్గొనడం జరిగింది. మొత్తం మహిళా దినోత్సవం రోజున 686 మంది కార్యక్రమంలో పాల్గొన్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు గాను మహిళలందరూ చాలా సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. పాఠశాలకు వంట పాత్రలు దాతల సహకారం అందించారు. మహిళలకు వివిధ రకాల గేమ్స్ ,ఆటలు,పాటలు, సరదాగా కోలాటాలు, నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ ,వెంకటరమణ ఫర్నిచర్స్,రేవంత్ ఇండస్ట్రీస్, వరుణ్ ఫర్నిచర్స్, కీర్తి జూయలర్స్, సాయిదత్త సారీస్, నల్లపాటి శ్రీధర్ అండ్ శ్రీకాంత్ ఐరన్ మర్చంట,ఇమ్మడి సిల్వర్ జువెలర్స్ హైదరాబాద్ వారు, సహకరించిన దాతలు అందరికీ కూడా పేరుపేరున త్రిశక్తి వనిత గ్రూప్ సభ్యులందరి తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఏది ఏమైనా సూర్యాపేట జిల్లాలో త్రిశక్తి వనిత గ్రూప్ సభ్యులు ఐకమత్యంతో పని చేస్తూ ఒక ప్రక్క ఆర్యవైశ్య కుటుంబాల్లోనూ, మరొక ప్రక్క మహిళలకు ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడంలో దాతల సహాయంతో తమకు తోచిన విధంగా సహకారాలు అందించడం చాలా సంతోషంగా ఉందని, సేవలను గుర్తించి ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకొని, సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు.

# 15 నిమిషాల్లో పని మనిషి.. ఆన్‌లైన్ సర్వీస్‌కి పరాకాష్ట!

ఆన్‌లైన్ డెలివరీ అన్నది ఇప్పుడు సర్వ సాధారణమై పోయింది. మనిషి దైనందిన జీవితంలో భాగంగా మారిపోయింది. ఫుడ్ డెలివరీతో మొదలైన ఆన్‌లైన్ డెలివరీ సేవలు క్రమంగా కిరాణాతో పాటు అనేక రకాల వస్తువులు, సర్వీసులు నిమిషాల వ్యవధిలో ఇంటి ముంగిటకు చేర్చే వరకూ వచ్చేశాయి. ఈ సేవలు ఇక్కడితో ఆగేలా లేవు. తాజాగా ప్రముఖ హోమ్ సర్వీసెస్ సంస్థ అయిన అర్బన్ కంపెనీ 'ఇన్‌స్టా మెయిడ్స్ / ఇన్‌స్టా హెల్ప్' అనే సర్వీస్‌ను ప్రారంభించింది. దీని ద్వారా 15 నిమిషాల పనిమనిషి మీ ఇంటి ముంగిటకు వస్తారు. ఈ సర్వీస్ ప్రారంభంతో అర్బన్ కంపెనీ ఆన్‌లైన్ సేవలను మరో స్థాయికి తీసుకెళ్లింది. ఈ విషయాన్ని కంపెనీ తన అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ప్రకటించింది.
ప్రస్తుతానికి ముంబైలో ఈ సేవను ప్రవేశపెట్టామని, ఇది 'పైలట్ దశలో' ఉందని అర్బన్ కంపెనీ పేర్కొంది. త్వరలోనే ఇతర నగరాలకు విస్తరిస్తామని తెలిపింది. ఈ సేవలో భాగస్వాములకు అంటే పని మనుషులకు 'గంటకు రూ .150 నుండి 180' లభిస్తుందని, అయితే ప్రస్తుతానికి ఈ సేవను గంటకు రూ .49 లకే అందిస్తున్నట్లు వివరించింది.

"అర్బన్ కంపెనీలో, మా సేవా భాగస్వాముల శ్రేయస్సుకు మేము కట్టుబడి ఉన్నాము. ఈ కొత్త సర్వీస్ ఆఫర్ లో, భాగస్వాములు ఉచిత ఆరోగ్య బీమా, అన్‌దిజాబ్ లైఫ్ & యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ తో పాటు గంటకు రూ. 150180 సంపాదిస్తారు. నెలకు 132 గంటలు (22 రోజులు × రోజుకు 6 గంటలు) పనిచేసే భాగస్వాములకు నెలకు కనీసం రూ.20,000 ఆదాయం లభిస్తుంది" అని రాసుకొచ్చింది. అర్బన్ కంపెనీ సోషల్ మీడియాలో ఈ పోస్ట్ షేర్ చేసిన వెంటనే వైరల్‌గా మారింది. నెటిజన్ల నుంచి భిన్నమైన రియాక్షన్లు వచ్చాయి. ఆన్‌లైన్ సర్వీస్‌కి ఇది పరాకాష్ట అని పలువురు కామెంట్లు చేశారు.





# పెట్రోల్ బైక్ vs ఎలక్ట్రిక్ బైక్ ఏది ఎంచుకోవాలి?

ఇండియన్ మార్కెట్లో ప్రస్తుతం పెట్రోల్, ఎలక్ట్రిక్ బైకులు మాత్రమే కాకుండా సీఎన్‌జీ బైక్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే చాలామంది.. ఎలక్ట్రిక్ బైక్ కొనాలా? పెట్రోల్ బైక్ కొనాలా? అనే సందిగ్ధంలో పడుతుంటారు. ఈ కథనంలో దేనివల్ల ఎలాంటి ఉపయోగాలు ఉన్నాయనే విషయాలను వివరంగా తెలుసుకుందాం.

**ఎలక్ట్రిక్ బైక్స్**

ప్రస్తుతం మార్కెట్లో దాదాపు ప్రతి కంపెనీ.. ఎలక్ట్రిక్ వాహన విభాగంలో బైకులను లాంచ్ చేస్తూనే ఉంది. పెట్రోల్ మోడల్స్‌తో పోలిస్తే.. ఎలక్ట్రిక్ బైకులకు మెయింటెనెన్స్ ఖర్చు తక్కువ. అంతే కాకుండా ఇవి పర్యావరణ హితం కూడా. అంటే ఎలక్ట్రిక్ వాహనాలు ఎలాంటి కాలుష్య కారకాలను వాతావరణంలోకి విడుదల చేయవు. ఎలక్ట్రిక్ వాహనాల్లో లిథియం అయాన్ బ్యాటరీ లేదా లిథియం అయాన్ పాస్ఫేట్ బ్యాటరీలు ఉంటాయి. ఇవి ఎక్కువ మన్నికను ఇస్తాను. సంస్థలు కూడా ఈ బ్యాటరీలపైన మంచి వారంటీ కూడా అందిస్తాయి. విద్యుత్ శక్తిని ఉపయోగించుకోవడం ద్వారా.. శిలాజ ఇంధన వినియోగం మాత్రమే కాకుండా కార్బన్ ఉద్గారాలు కూడా గణనీయంగా తగ్గుతాయి.

**పెట్రోల్ బైక్స్**

చాలా కాలంగా ఎక్కువమంది పెట్రోల్ బైకులనే ఉపయోగిస్తున్నారు. ఇంధనం అయిపోగానే.. వెంటనే ఫిల్ చేసుకోవడానికి లేదా నింపుకోవడానికి పెట్రోల్ బంకులు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఎలాంటి ఆందోళన లేకుండా ఎక్కువ దూరం ప్రయాణించగల సామర్థ్యం ఈ పెట్రోల్ బైకులకు ఉంటుంది. ఈ కారణంగానే చాలామంది పెట్రోల్ బైకులను కొనుగోలు చేస్తుంటారు. పనితీరు పరంగా కూడా పెట్రోల్ బైకులు.. ఎలక్ట్రిక్ బైకుల కంటే ఉత్తమంగా ఉంటాయి.

**ఎలక్ట్రిక్ బైక్స్ ఎక్కువ కొనుగోలు చేయకపోవడానికి కారణం**

ఇండియన్ మార్కెట్లో లెక్కకు మించిన ఎలక్ట్రిక్ బైక్స్ అందుబాటులో ఉన్నప్పటికీ.. చాలామంది పెట్రోల్ బైక్స్ కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపుతుంటారు. దీనికి ప్రధాన కారణం మౌలిక సదుపాయాలైన ఛార్జింగ్ స్టేషన్స్ కావలసినన్ని అందుబాటులో లేకపోవడం అనే తెలుస్తుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే.. ఛార్జింగ్ మధ్యలోనే ఖాళీ అవుతుందేమో అనే భయం కూడా ఎక్కువమంది కొనుగోలు చేయకపోవడానికి కారణం అనే చెప్పాలి.

# శాలరీ అకౌంట్ ఉంటే ఇవన్నీ ఉన్నట్టే..



వివిధ సంస్థల్లో పనిచేసే చాలా మంది ఉద్యోగులకు శాలరీ అకౌంట్ ఉంటుంది. ఇది సాధారణ బ్యాంకు ఖాతా లాగే పనిచేస్తుంది. ఇందులో కంపెనీల యాజమాన్యాలు ప్రతి నెలా జీతాన్ని జమ చేస్తారు. ఈ డబ్బును ఖాతాదారులు ఉపసంహరించుకుంటారు.. లావాదేవీలు చేస్తారు.. ఖర్చులను నిర్వహిస్తారు. అయితే శాలరీ అకౌంట్ తో వచ్చే ఎక్స్ క్లూజివ్ బెనిఫిట్స్ ఏంటో తెలుసా? ఖాతా తెరిచే సమయంలో చాలా బ్యాంకులు ఈ ప్రయోజనాలను వెల్లడించవు. క్లాసిక్ శాలరీ అకౌంట్స్, వెల్త్ శాలరీ అకౌంట్స్, బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్స్‌శాలరీ, డిఫెన్స్ శాలరీ అకౌంట్స్ ఇలా వివిధ రకాల శాలరీ ఖాతాలను బ్యాంకులు అందిస్తున్నాయి. వీటిలో దాగిఉన్న ఆర్థిక ప్రయోజనాల గురించి ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.

**యాక్సిడెంటల్ డెత్, హెల్త్ ఇన్సూరెన్స్**

చాలా శాలరీ అకౌంట్లు యాక్సిడెంటల్ డెత్ కవర్ లేదా హెల్త్ ఇన్సూరెన్స్ ను అదనపు భద్రతా ఫీచర్‌గా కలిగి ఉంటాయి. ఖాతాదారులకు, వారి కుటుంబాలకు ఆర్థిక రక్షణను అందిస్తాయి.

**రుణాలపై తక్కువ వడ్డీ రేట్లు**

శాలరీ అకౌంట్ హోల్డర్లకు బ్యాంకులు వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలపై ప్రిఫరెన్షియల్ వడ్డీ రేట్లను అందిస్తున్నాయి. దీనివల్ల రుణ కాలపరిమితిలో గణనీయమైన మొత్తాన్ని ఆదా చేసుకోవచ్చు.

**ఓవర్ డ్రాఫ్ట్ ఫెసిలిటీ**

అత్యంత ఉపయోగకరమైన ప్రయోజనాలలో ఒకటి ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం. ఇది అత్యవసర పరిస్థితుల్లో మీ ఖాతా బ్యాలెన్స్ జీరో ఉన్నప్పటికీ కొంత డబ్బును ఉపసంహరించుకునే అవకాశం కల్పిస్తుంది.

**ప్రాధాన్య బ్యాంకింగ్ సేవలు**

వేగవంతమైన ప్రాసెసింగ్, డెడికేటెడ్ కస్టమర్ సర్వీస్, ఎక్స్ క్లూజివ్ బ్యాంకింగ్ ఆఫర్లతో సహా అనేక బ్యాంకులు శాలరీ అకౌంట్ హోల్డర్లకు ప్రాధాన్యతా సేవలను అందిస్తున్నాయి.

**ఉచిత క్రెడిట్ కార్డులు, రివార్డులు**

బ్యాంకులు తరచుగా శాలరీ అకౌంట్లతో కాంప్లిమెంటరీ క్రెడిట్ కార్డులను అందిస్తాయి. వార్షిక రుసుమును మాఫీ చేస్తాయి. రివార్డ్ పాయింట్లు, క్యాష్‌బ్యాక్, ప్రత్యేక డిస్కౌంట్లను అందిస్తాయి.

**ఆన్ లైన్ షాపింగ్ & డైనింగ్ డీల్స్**

శాలరీ అకౌంట్ హోల్డర్లకు ఆన్‌లైన్ షాపింగ్, డైనింగ్‌పై క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో సహా ప్రత్యేక డిస్కౌంట్లు లభిస్తాయి. జీవనశైలి ఖర్చులను మరింత చౌకగా చేస్తాయి.

**ఉచిత డిజిటల్ లావాదేవీలు**

సాధారణ ఖాతాల మాదిరిగా కాకుండా, చాలా బ్యాంకులు శాలరీ ఖాతాదారులకు నెఫ్ట్, ఆర్‌టీజీఎస్, ఐఎంపీఎస్ ఛార్జీలను మాఫీ చేస్తాయి.

**ఫ్రీగా చెక్ బుక్, డెబిట్ కార్డులు**

శాలరీ అకౌంట్ కస్టమర్లకు చాలా వరకు బ్యాంకులు ఎటువంటి రుసుములు లేకుండా చెక్ బుక్ లు, డెబిట్ కార్డులను అందిస్తుంటాయి. ఇవి చిన్నపాటివే అయినా పునరావృతమయ్యేవి కాబట్టి ప్రయోజనం ఉంటుంది.

**ఉచిత ఏటీఎం లావాదేవీలు**

అనేక బ్యాంకులు ప్రతి నెలా ఎక్కువ సంఖ్యలో ఉచిత ఏటీఎం ఉపసంహరణలను అనుమతిస్తాయి. దీంతో అదనపు ఛార్జీల గురించి ఆందోళన లేకుండా నగదును యాక్సెస్ చేసుకోవచ్చు.

**జీరో బ్యాలెన్స్ ఫెసిలిటీ**

చాలా శాలరీ అకౌంట్లు జీరో బ్యాలెన్స్ ఫీచర్‌తో వస్తాయి. అంటే కనీస బ్యాలెన్స్ నిర్వహించాల్సిన అవసరం ఉండదు. ఇది సాధారణ సేవింగ్స్ ఖాతాలకు లేని ప్రయోజనం.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL






# మీ టైమ్ అయిపోయింది.. వారికి ట్రంప్ హెచ్చరిక

**సానా:** యెమెన్‌లో హౌతీలపై అమెరికా సైన్యం విరుచుకుపడింది. హౌతీలపై అమెరికా జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు 24 మంది మరణించారు. ఈ నేపథ్యంలో దాడులపై ట్రంప్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హౌతీల టైమ్ ముగిసిపోయింది. దాడులకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే అంటూ వ్యాఖ్యలు చేశారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశారు. హౌతీలు బలంగా ఉన్న యెమెన్ రాజధాని సానాపై అమెరికా దళాలు దాడులు కొనసాగుతున్నాయి. అమెరికా బాంబు దాడులతో సానా చుట్టుపక్కల ప్రాంతాల్లో భూమి కంపించింది. భారీ మొత్తంగా బాంబు దాడులు చేయడంతో 24 మంది చనిపోయారు. వీరిలో నలుగురు చిన్నారులు, ఒక మహిళ ఉన్నారు. ఈ నేపథ్యంలో దాడులపై ట్రంప్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ క్రమంలో ట్రంప్.. 'హౌతీ ఉగ్రవాదులందరికీ హెచ్చరిక. వారి సమయం ముగిసింది. ఈ రోజు నుంచీ మీ దాడులకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందే. కాదంటే గతంలో ఎన్నడూ చూడనంతగా నరకాన్ని చూస్తారు' అంటూ హెచ్చరించారు. ఇదే సమయంలో ఇరాన్‌ను కూడా ట్రంప్ హెచ్చరించారు. హౌతీలకు మద్దతు తక్షణం ఆపాలని చెప్పారు. ఈ నేపథ్యంలో అమెరికా దాడులను హౌతీ పొలిటికల్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. ఈ దాడులకు సమాధానం చెప్పేందుకు యెమెన్ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని హెచ్చరించింది. ఇక, 2023 అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌హమాస్ యుద్ధం ప్రారంభమైన తర్వాత దాని తీరంలోని ఓడలపై హౌతీలు దాడులు ప్రారంభించారు. ఇది ప్రపంచ వాణిజ్యానికి ఆటంకంగా మారింది. 2023 నుంచి హౌతీలు 174 సార్లు అమెరికా యుద్ధ నౌకలపై, 145 సార్లు వాణిజ్య నౌకలపై దాడిచేసినట్టు సమాచారం.

# పాకిస్థాన్ ఆర్మీ కాన్వాయ్‌పై దాడి

## 10 మంది సైనికులు మృతి!



**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. పాకిస్థాన్ సైనికుల కాన్వాయ్‌ను టార్గెట్ చేసి బలూచ్ లిబరేషన్ ఆర్మీ దాడి చేసింది. ఈ క్రమంలో 10 మంది సైనికులు మృతిచెందగా.. మరో 21 మంది తీవ్రంగా గాయపడినట్టు తెలుస్తోంది. వివరాల ప్రకారం.. పాకిస్థాన్‌లోని క్వెట్టా నుండి టఫ్తాన్‌కు వెళ్తున్న ఆర్మీ కాన్వాయ్‌పై బలూచ్ లిబరేషన్ ఆర్మీ బాంబు దాడి చేసింది. ఎనిమిది ఆర్మీ సిబ్బంది బస్సులు వెళ్తున్న సమయంలో బలూచ్ ఆర్మీ కాల్పులు జరిపింది. ఒక బస్సుపై ఆత్మాహుతి దాడి చేసింది. ఈ దాడిలో పది మంది పాకిస్తాన్ సైనికులు మరణించగా, 21 మంది గాయపడ్డారు. పాకిస్తాన్‌లోని నోష్కి సమీపంలో ఈ దాడి జరిగినట్టు స్థానిక మీడియా తెలిపింది. ఈ దాడి ఘటనను పాకిస్తాన్ అధికారులు సైతం ధృవీకరించారు. మరోవైపు.. ఈ దాడిని తామే చేసినట్టు బలూచ్ లిబరేషన్ ఆర్మీ పేర్కొంది. ఈ దాడిలో 90 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్టు తెలిపింది. ఇదిఆ ఉండగా.. ఈ ఘటనలో కేవలం ఏడుగురు సైనికులు మాత్రమే చనిపోయినట్టు పాకిస్థాన్ ఆర్మీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



# ఘోర అగ్ని ప్రమాదం

## 51 మంది దుర్మరణం!

**నార్త్ మెసీడోనియా:** యూరప్ లోని నార్త్ మెసీడోనియాలో ఘోర అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ నైట్ క్లబ్ లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని భారీ ప్రాణనష్టం వాటిల్లింది. ఈ ఘటనలో సుమారు 51 మంది దుర్మరణం చెందినట్లు తెలుస్తోంది. వందల సంఖ్యలో గాయాలబారిన పడ్డారు. కోకానిలో ఉన నైట్ క్లబ్ లో ఓ కార్యక్రమం నిమిత్తం భారీ సంఖ్యలో జనం హాజరయ్యారు. మెసీడోనియా పాప్ గ్రూప్ డీఎన్ కే ప్రోగ్రామ్ ఉండటంతో అభిమానులు భారీ ఎత్తున నైట్ క్లబ్ కు వచ్చారు. అయితే నైట్ క్లబ్ లో ఉన్న మందుగుండ సామాగ్రి అంటుకుని మంటలు వ్యాపించాయి. అక్కడకు వచ్చిన వారు తేరుకునే లోపు పలువురు మంటలకు ఆహుతయ్యారు. ఈ కార్యక్రమానికి సుమారు 1500 మంది హాజరైనట్లు తెలుస్తోంది. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ దుర్ఘటనలో చనిపోయిన వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నట్లు సమాచారం. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఏర్పాటైన డీఎన్ కే పాప్ గ్రూప్ కు అధిక సంఖ్యలో యువత ఫ్యాన్స్ గా ఉన్నారు. డీఎన్ కే ఎక్కడ షో చేసినా యువతే అధికంగా హాజరవుతారు. ఈ క్రమంలోనే తాజా షోకు కూడా యువత ఎక్కువగా హాజరయ్యారని నార్త్ మెసీడోనియా న్యూస్ ఏజెన్సీ ఎమ్ఐఏ స్పష్టం చేసింది.



# 26/11 ముంబై దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్ హతం?

**జీలం:** పాకిస్తాన్‌లోని జీలం ప్రాంతంలో జరిగిన కాల్పుల్లో.. 26/11 ముంబై దాడుల సూత్రధారి, లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్ సయీద్ హతమయ్యాడని సమాచారం. అయితే హఫీజ్ సయీద్ మృతిని పాక్ అధికారులు ఇంకా నిర్ధారించలేదు. హతమైన వారిలో లష్కర్ ఉగ్రవాది అబూ కతల్ కూడా ఉన్నాడని తెలుస్తోంది. పాకిస్తాన్‌లోని జీలంలో గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరపగా, ఇద్దరు మృతి చెందినట్లు అధికారులు నిర్ధారించారు. మృతుల్లో అబూ కతల్ కూడా ఉన్నాడని, అతను ఎల్ఇటి ఉగ్రవాది అని, అతను హఫీజ్ సయీద్ మేనల్లుడని అధికారులు తెలిపారు. భారతదేశ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో హఫీజ్ సయీద్ కూడా ఉన్నాడు. 26/11 ముంబై దాడులకు హఫీజ్ సయీద్ ప్రధాన సూత్రధారి. అలాగే పుల్వామా దాడికి కూడా హఫీజ్ సయీద్ ప్రధాన సూత్రధారి. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థపై దాదాపు 10 మిలియన్ డాలర్ల బహుమతి ఉంది. ఉగ్రవాద నిధులకు సంబంధించిన కేసులో హఫీజ్ సయీద్‌ను జైలుకు తరలించారు. హఫీజ్ సయీద్ కాశ్మీర్‌లో ఉగ్రవాద గ్రూపులకు నిధులు సమకూరుస్తున్నాడు. హఫీజ్ సయీద్‌ను తమకు అప్పగించాలని భారత ప్రభుత్వం పాకిస్తాన్‌ను అభ్యర్థించింది. జమ్ముకశ్మీర్‌లో అనేక ఉగ్రవాద దాడులకు పాల్పడటమే కాకుండా, ముంబైలో జరిగిన 26/11 దాడుల కుట్ర హఫీజ్ సయీద్ పన్నినదే అని నిర్ధారణ అయ్యింది. దాడులు జరిగిన సమయంలో అతను దాడి చేసిన వారితో టచ్‌లో ఉన్నాడని సమాచారం. ముంబైలో జరిగిన ఉగ్రదాడుల్లో 160 మందికి పైగా జనం మృతి చెందారు.

# సునీత వచ్చేస్తోంది.. ఐఎస్ఎస్‌తో క్రూ-10 అనుసంధానం సక్సెస్



అంతరిక్షకేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ భూమి మీదకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. నాసాస్పేస్ ఎక్స్‌లు చేపట్టిన క్రూ10 మిషన్ ఐఎస్ఎస్‌తో అనుసంధానం విజయవంతమైంది. ఇవాళ (ఆదివారం) ఉదయం 9:40 గంటలకు ఈ అనుసంధాన ప్రక్రియ జరిగినట్లు వెల్లడించిన నాసా.. ఇందుకు సంబంధించిన వీడియోను కూడా విడుదల చేసింది. నాసాస్పేస్ ఎక్స్‌లు చేపట్టిన క్రూ10 మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములతో కూడిన ఫాల్కన్ 9 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 4.33 గంటలకు అమెరికాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్ 9 రాకెట్ డ్రాగన్ క్యాప్సుల్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా నలుగురు వ్యోమగాములు మెక్ క్లెయిన్, నికోల్ అయర్స్, టకుయా ఒనిషి, కిరిల్ పెస్కోవ్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లారు. ఈ నలుగురు వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ స్థానంలో పనిచేయనున్నారు. సునీతా విలియమ్స్ అంతరిక్షంలోకి వెళ్లి నేటికి 284 రోజులైంది! 2024 జూన్ 5న ఆమె అక్కడికి చేరుకున్నారు. తిరిగి జూన్ 12, 15 తేదీల్లో భూమి మీదకు తిరిగి రావాల్సి ఉంది కానీ రాలేదు! భూ కక్ష్యకు సుమారు 400 కి.మీ. ఎత్తున ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐ.ఎస్.ఎస్.) సునీతను, ఆమె సహ వ్యోమగామి బుచ్ విల్మోర్‌ను విజయవంతంగా మోసుకెళ్లిన 'బోయింగ్ స్టార్‌లైనర్' వ్యోమనౌక తీరా వారిని అక్కడ దింపేశాక, పని చేయటం మానేసింది! 'నాసా' టీమ్ భూమి మీద నుంచి స్టార్‌లైనర్‌కు చేసిన మరమ్మత్తులు ఫలితాన్నివ్వలేదు. ఏమైతేనేం, వారం రోజుల పనికి వెళ్లి, నెలలపాటు అంతరిక్షంలోనే ఉండిపోయిన సునీతా విలియమ్స్ భూమి పైకి తిరిగొచ్చే తేదీ ఖరారైంది. అందుకోసం ఎలాన్ మస్క్ సంస్థ 'స్పేస్‌ఎక్స్' దగ్గర రన్నింగ్‌లో ఉన్న 'క్రూ-10' అనే వ్యోమనౌకను సిద్ధం చేశారు. క్రూ10 మిషన్ ఐఎస్ఎస్‌తో అనుసంధానం విజయవంతమైంది.

# ఆ ఏడాదే పుష్ప 3 రిలీజ్

## ప్రకటించిన నిర్మాత

పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా ఫైరు.. కాదుకాదు, వైల్డ్ ఫైరు.. అని నిరూపించాడు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. పుష్ప ఫ్రాంచైజీతో బాక్సాఫీస్ రికార్డులు తిరగరాశాడు. పుష్ప 1.. 2021లో విడుదల కాగా దాని సీక్వెల్ 2024లో రిలీజైంది. మరి పుష్ప 3 ఎప్పుడు? అని ఫ్యాన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. వారి ఎదురుచూపులకు నిర్మాత రవిశంకర్ తెర దించాడు. 2028లో పుష్ప 3 (Pushpa 3 Movie) విడుదల చేస్తామని వెల్లడించాడు. విజయవాడలో ఆదివారం జరిగిన రాబిన్‌హుడ్ ప్రెస్‌మీట్‌లో ఈ విషయాన్ని తెలిపాడు. అలాగే బన్నీ.. ప్రస్తుతం అట్లీతో ఓ సినిమా చేస్తున్న సంగతిని కూడా బయటపెట్టాడు.




### పుష్పరాజ్ ప్రయాణం ఎలా మొదలైందంటే?

అల్లు అర్జున్, రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం పుష్ప. ఫహద్ ఫాజిల్, సునీల్, డాలి ధనంజయ, అజయ్ ఘోష్, జగదీశ్ ప్రతాప్, అనసూయ కీలక పాత్రలు పోషించారు. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ మూవీకి శ్రీకాంత్ విస్స డైలాగ్స్ రాశాడు. మైత్రీమూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మించారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ మూవీ 2021 డిసెంబర్ 17న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. రూ.350 కోట్లకు పైగా వసూలు చేసింది. దీంతో దీనికి సీక్వెల్‌గా పుష్ప: ద రూల్ తెరకెక్కింది. 2024 డిసెంబర్ 5న రిలీజైన ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా రూ.1650 కోట్లు రాబట్టింది. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల ఊచకోత సృష్టించిన పుష్ప 2కి సీక్వెల్ ఉంటుందని చిత్రయూనిట్ ఎప్పుడో ప్రకటించింది. తాజాగా రిలీజ్ ఎప్పుడో కూడా చెప్పేయడంతో ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# నాని టైమ్ నడుస్తోంది..

## ఈసారి రూ.54 కోట్ల డీల్!

ఇండస్ట్రీలో ఏ హీరోకి అయినా హిట్ ఫ్లాప్స్ సాధారణం. కానీ గత కొన్నేళ్లుగా వరస సినిమాలతో విజయాల్ని అందుకుంటున్న హీరోల్లో నాని ఒకడు. ఓవైపు హీరోగా హిట్స్ కొడుతూనే మరోవైపు నిర్మాతగానూ సూపర్ సక్సెస్ అందుకుంటున్నాడు. రీసెంట్ హిట్ 'కోర్ట్'.. నాని ప్రొడక్షన్ నుంచి వచ్చిందే. ప్రస్తుతం తెలుగులో చాలా సినిమాలకు ఓటీటీ డీల్స్ జరగట్లేదు. దీంతో ఫైనల్ కాపీ సిద్ధమైన విడుదలకు నోచుకోవట్లేదు. అదే టైంలో నాని సినిమాలకు మాత్రం రిలీజ్ కి చాలారోజుల ముందే ఓటీటీ డీల్స్ క్లోజ్ అయిపోతున్నాయి. 'కోర్ట్'ని ఏకంగా రూ.8 కోట్లకు నెట్ ఫ్లిక్స్ తీసుకుందని టాక్. రీసెంట్ గా నాని హీరోగా 'ద ప్యారడైజ్' మూవీని ప్రకటించారు. దీని షూటింగ్ అసలు మొదలు కాలేదు కానీ ఓటీటీ డీల్ మాత్రం రూ.65 కోట్లకు జరిగిపోయిందట. నాని ఇప్పటికే పూర్తి చేసిన 'హిట్ 3' చిత్ర ఓటీటీ హక్కుల్ని ఇదివరకే నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకుందని ప్రకటించారు. ఇకపోతే ఈ డీల్ రూ.54 కోట్ల జరిగిందని తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇదంతా చూస్తుంటే ప్రస్తుతం ఇండస్ట్రీలో నాని టైమ్ నడుస్తోంది. పట్టిందల్లా బంగారమవుతుందనిపిస్తోంది.



# రష్మికను చూసి ఇబ్బంది పడ్డ శ్రీలీల.. ఎందుకో తెలుసా?

శ్రీలీల.. గత కొంతకాలంగా టాలీవుడ్‌లో ఎక్కువ వినిపిస్తున్న పేరు ఇది. ఒకవైపు స్టార్ హీరోలతో మరోవైపు యంగ్ స్టార్స్‌లో సినిమాలు చేస్తూ తెలుగు తెరపై దూసుకెళ్తోంది. అయితే ఈ టాలెంటెడ్ బ్యూటీ ఇటీవల తన దూకుడుని తగ్గించింది. ఈ మధ్యకాలంలో ఆమె నటించిన చిత్రాలేవి రిలీజ్ కాలేదు. కానీ పుష్ప 2లో ఐటమ్ సాంగ్ చేసి మరోసారి వార్తల్లో నిలిచింది. ఒకవైపు హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తూనే.. సడెన్‌గా పుష్ప 2లో స్పెషల్ సాంగ్‌కి అల్లు అర్జున్‌తో కలిసి స్టెప్పులేసింది. 'కిస్సిక్' అంటూ సాగే ఈ పాట ఎంతపెద్ద హిట్ అయిందో అందరికి తెలిసిందే.

అయితే ఈ పాట ఒప్పుకునేందుకు శ్రీలీల కాస్త వెనకడుకు వేసిందట. కెరీర్ పరంగా ఇబ్బందులు ఎదురవుతాయేమోనని ఆలోచించిందట. కానీ డైరెక్టర్ సుకుమార్ నచ్చజెప్పి పాటకు ఒప్పించినట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ పాట శ్రీలీల కెరీర్‌కి ప్లస్సే అయింది. అయితే ఈ పాట షూటింగ్ కోసం వెళ్లినప్పుడు సెట్‌లో రష్మికను చూసి శ్రీలీల భయపడిందట. ఆమెతో మాట్లాడేందుకు కాస్త సిగ్గు పడిందట. దానికి గల కారణం ఏంటో కూడా శ్రీలీల వివరించింది.

శ్రీలీల హీరోయిన్‌గా నటించిన తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. నితిన్ హీరోగా నటించిన ఈ చిత్రం ఈ నెల 28న రిలీజ్ కానుంది. అయితే ఈ చిత్రంలో మొదట రష్మికను హీరోయిన్‌గా తీసుకున్నారు. కొంతవరకు షూటింగ్ ప్రారంభించిన తర్వాత ఆమె ప్లేస్‌లో శ్రీలీలను తీసుకున్నారు. పుష్ప-2 ఐటమ్ సాంగ్ షూటింగ్‌లో మొదటిసారి రష్మికని కలిసినప్పుడు- రాబిన్‌హుడ్ రీ ప్లేస్‌మెంట్ గుర్తు వచ్చి, శ్రీ లీల ఇబ్బంది పడింది. అయితే డేట్స్ ప్రాబ్లమ్ వల్ల తనే రాబిన్‌హుడ్ సినిమా వదిలేశానని, రష్మిక చెప్పడంతో ఊపిరి పీల్చుకుందట శ్రీ లీల. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో ఆమే చెప్పింది. ఇక ఈ స్పెషల్ సాంగ్ కోసం శ్రీలీలకు మైత్రీ మూవీ మేకర్స్ భారీగానే పారితోషికం అందించిందట. ఈ ఒక్క పాటకే దాదాపు రూ. 2 కోట్లు అందించినట్లు సమాచారం.

క్రీడా వార్తలు | SPORTS NEWS



# ఓపెనర్లగా కాన్వే, రవీంద్ర..

## సీఎస్కే ప్లేయింగ్ ఎలెవన్ ఇదే?

ఐపీఎల్ 2025 సీజన్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ (CSK) అన్ని విధాల సిద్ధమవుతోంది. చెపాక్‌లోని చిదంబరం స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ క్యాంపులో సీఎస్కే ఆటగాళ్లు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గత సీజన్‌లో గ్రూపు స్టేజికే పరిమితమైన సీఎస్కే.. ఈ ఏడాది సీజన్‌లో మాత్రం అదరగొట్టాలన్న పట్టుదలతో ఉంది. రికార్డు స్థాయిలో ఆరో ఐపీఎల్ ట్రోఫీపై మెన్ ఇన్ ఎల్లో కన్నేసింది. అందుకోసం సీఎస్కే తమ ఆస్త్రశాస్త్రాలను సిద్ధం చేసుకుంటుంది. ఈ ఏడాది సీజన్ కోసం సామ్ కుర్రాన్, డెవాన్ కాన్వే, రవిచంద్రన్ అశ్విన్ వంటి స్టార్ ఆటగాళ్లు సీఎస్కే జట్టులోకి వచ్చారు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, రచిన్ రవీంద్ర, శివమ్ దూబే, ధోని వంటి ఆటగాళ్లతో సీఎస్కే బ్యాటింగ్ విభాగం పటిష్టంగా కన్పిస్తోంది. బౌలింగ్‌లోనూ పతిరానా, నాథన్ ఈల్లీస్, నూర్ అహ్మద్ వంటి యువ సంచలనాలతో సీఎస్కే బలంగా ఉంది. ఈ ఏడాది సీజన్‌లో సీఎస్కే తమ తొలి మ్యాచ్‌లో మార్చి 23న చెపాక్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఈ క్రమంలో సీఎస్కే బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఆ జట్టు మాజీ ఆటగాడు అంబటి రాయుడు అంచనా వేశాడు. సీఎస్కే ఇన్నింగ్స్‌ను రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు డెవాన్ కాన్వే ప్రారంభించాలని రాయుడు అభిప్రాయపడ్డాడు. కాగా గత సీజన్‌లో గైక్వాడ్‌కు ఓపెనింగ్ భాగస్వామిగా రచిన్ రవీంద్ర వచ్చాడు. కానీ గత సీజన్‌లో రవీంద్ర తన మార్క్ చూపించలేకపోయాడు. ఈ క్రమంలోనే రవీంద్రను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు పంపించాలని రాయుడు సూచించాడు. అదేవిధంగా నాలుగో స్థానం కోసం దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్ మధ్య పోటీ ఉంటుందని ఈ భారత మాజీ క్రికెటర్ చెప్పుకొచ్చాడు. ఇక ఆల్‌రౌండర్ల కోటాలో శివమ్ దూబే, సామ్ కుర్రాన్, రవీంద్ర జడేజాలకు అంబటి చోటు ఇచ్చాడు. ఫాస్ట్ బౌలర్లగా మతీషా పతిరాన, అన్షుల్ కాంబోజ్.. స్పెషలిస్టు స్పిన్నర్‌గా అశ్విన్‌కు తుది జట్టులో అతడు అవకాశమిచ్చాడు. కాగా ఐపీఎల్ 18 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఈడెన్‌గార్డెన్స్ వేదికగా కేకేఆర్‌ఆర్సీబీ జట్లు తలపడనున్నాయి. రాయుడు ఎంపిక చేసిన సీఎస్కే ప్లేయింగ్ ఎలెవన్ ఇదే: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, దీపక్ హుడా/రాహుల్ త్రిపాఠి/విజయ్ శంకర్, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, ఎంఎస్ ధోని (వికెట్ కీపర్), రవిచంద్రన్ అశ్విన్, సామ్ కర్రాన్, మతీషా పతిరణ, అన్షుల్ కాంబోజ్

**బెంచ్:** ఖలీల్ అహ్మద్, నూర్ అహ్మద్, షేక్ రషీద్, ముఖేష్ చౌదరి, గుర్జప్నీత్ సింగ్, నాథన్ ఎల్లిస్, కమలేష్ నాగర్కోటి, రామకృష్ణ ఘోష్, శ్రేయాస్ గోపాల్, వంశ్ బేడి, ఆంద్రీ సిద్ధార్థ్, జామీ ఓవర్టన్

# ఒలింపిక్ చాంపియన్‌గా నిలిస్తే బాగుంటుంది!

## దానికి మరేది సాటిరాదన్న విరాట్ కోహ్లి

### ఇప్పట్లో రిటైర్మెంట్ ఆలోచన లేదని వ్యాఖ్య

### ఆటను ఆస్వాదించినంత కాలం కొనసాగుతానని వెల్లడి




బెంగళూరు: ఒక క్రికెటర్‌గా ఒలింపిక్ పతకాన్ని గెలుచుకోగలిగితే అది ఎంతో ప్రత్యేకం అవుతుందని, దానికి మరేదీ సాటి రాదని భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి అన్నాడు. 2028 లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలు జరగనున్న నేపథ్యంలో కోహ్లి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 1900 తర్వాత తొలిసారి విశ్వక్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెడుతున్నారు. ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడంలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) కూడా కీలక పాత్ర పోషించిందని కోహ్లి అభిప్రాయపడ్డాడు. 'ఒలింపిక్ చాంపియన్‌గా నిలిస్తే ఎంతో బాగుంటుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఐపీఎల్ ఇందులో ప్రముఖ పాత్ర పోషించింది. క్రికెట్‌ను ఒలింపిక్స్‌లో భాగమయ్యే స్థాయికి తెచ్చింది. ఇది యువ ఆటగాళ్లకు గొప్ప అవకాశం. ప్రతి అథ్లెట్ దాని కోసమే కష్టపడతాడు. పురుషుల, మహిళల విభాగాల్లో మన జట్టు పతకానికి చేరువవుతుందని అనుకుంటున్నా' అని విరాట్ అన్నాడు. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీలో చక్కటి ప్రదర్శన కనబర్చిన కోహ్లి... లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ వరకు కెరీర్ కొనసాగిస్తాడా అనేది చూడాలి. 2028కి విరాట్ 40వ పడిలోకి అడుగుపెట్టనున్నాడు. 'ఇప్పుడే దాని గురించి మాట్లాడటం తొందరపాటు అవుతుంది. ఒకవేళ ఒలింపిక్ పసిడి పతకం కోసం మ్యాచ్ ఆడుతుంటే... నేను గుట్టు చప్పుడు కాకుండా జట్టులో చేరి పతకం సాధించి ఇంటికి వస్తా' అని విరాట్ చమత్కరించాడు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు వివిధ అంశాలపై విరాట్ పంచుకున్న విశేషాలు అతడి మాటల్లోనే...

- మహిళల ప్రీమియర్ లీగ్ వల్ల దేశంలో మహిళల క్రికెట్ ప్రాధాన్యత మరింత పెరిగింది. భారత మహిళల క్రికెట్ జట్టు గత కొంతకాలంగా నిలకడైన ప్రదర్శన చేస్తూ అభిమానుల మనసులు గెలుచుకుంటోంది.
- ఆరేడేళ్ల క్రితం మహిళల ఆటకు ఇంత ప్రాధాన్యత దక్కలేదు. డబ్ల్యూపీఎల్‌కు వస్తున్న ఆదరణ చూస్తుంటే ముచ్చటేస్తోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా వారి గురించి చర్చ జరుగుతోంది. రోజు రోజుకు ఆటలో ప్రమాణాలు పెరుగుతున్నాయి.
- వేరే రంగాల్లో విజయం సాధించినప్పుడు రాని పేరు, ప్రఖ్యాతలు క్రీడల్లో సులువుగా వస్తాయి. ఎందుకంటే మైదానంలో ఆడేది తామే అని ప్రతి ఒక్క అభిమాని ఊహించుకుంటాడు కాబట్టే ఇది సాధ్యం. అందుకే క్రీడాకారులు విజయాలు సాధించినప్పుడు యావత్ భారత్ సంబరాలు చేసుకుంటుంది.
- ఆటను ఆస్వాదించడం నాకు ఇష్టం... అదే చేస్తున్నా. ఎలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవాలని అనుకోవడం లేదు. మైదానంలో వంద శాతం కష్టపడటం అలవాటు. దాన్ని ఇక మీద కూడా కొనసాగిస్తా. భావోద్వేగాలు ఆటలో భాగం. వాటిని దాచుకోవడానికి ఎప్పుడూ ప్రయత్నించను.
- ఆటలో పోటీ సహజం. అప్పుడే మన సహజ నైపుణ్యం బయటకు వస్తుంది. ఈ స్థాయికి చేరుకున్నాక కూడా ఇంకేదో గుర్తింపు పొందాలనుకోవడం లేదు. ఆటపై ప్రేమ ఉన్నంతకాలం మైదానంలో కొనసాగుతా.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com